గోడ కట్టరు.. గోడు పట్టదు

వమిడిముక్కల మండలం కపిలేశ్వరపురంలో అంగన్‌వాడీ ప్రీ ప్రైమరీ స్కూలుకు ప్రహారీ లేక చుట్టూ ఉన్న పంటపొలాల నుంచి పాములు, విష పురుగులు లోపలికి వచ్చేస్తున్నాయి. దీంతో స్థానికులే ఇలా చుట్టూ వస్త్రాన్ని చుట్టారు. ఈ కేంద్రం ఎదురుగానే రోడ్డు పక్కన మోటారు పంపు ఫ్యూజ్ పెట్టెలు నోరుతెరచి ఉండడంతో చిన్నారులు ఆటు కుంటూ వెళ్లి ఎక్కడ దానిని పట్టుకుంటారోనని స్థానికులు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని అంగన్‌వాడీ సిబ్బంది.. చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


అంగన్‌వాడీ చుట్టూ ప్రహారీ లేక వస్త్రం చుట్టారిలా..


ఎదురుగానే ఫ్యూజు బాక్సులు

-ఈనాడు, కృష్ణా

కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నేడు

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తారని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని అన్ని మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉంటుందన్నారు. అర్జీదారులు తమకు సమీపంలోని పరిష్కార వేదిక కేంద్రాల్లో అర్జీలు సమర్పించినా తగు పరిష్కార చర్యలు తీసుకుంటారన్నారు. కాల్ సెంటరు నంబరు 1100 కు ఫోన్ చేసి అర్జీలు నమోదు చేసుకోవడంతో పాటు వాటి స్థితిగతులు తెలుసుకోవచ్చన్నారు. ఆర్డీవో కార్యాలయాల్లో రెవెన్యూ క్లినిక్‌లు నిర్వహిస్తారన్నారు. అర్జీదారులు తమ సమస్య పరిష్కారానికి సంబంధించిన స్పందనను క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయవచ్చని, అన్ని ప్రజా సమస్యల పరిష్కార వేదికల వద్ద క్యూఆర్ కోడ్ ఉంటుందని స్పష్టం చేశారు.

కబ్జా కోరల్లోనే బుడమేరు..

- కాగితాలు దాటని ఆక్రమణల తొలగింపు
- వందల ఎకరాల్లో అక్రమ నిర్మాణాలు, సాగు
- ప్రళయం నుంచి గుణపాఠాలు నేర్వని దారుణం


పిల్లకాలువలా.. ఇవీ.. న్యూరాజరాజేశ్వరీ పేటలో బుడమేరును మట్టితో పూడ్చి కట్టిన నిర్మాణాలు. చిన్న రేకుల షెడ్డుల నుంచి బహుళ అంతస్తుల భవనాల వరకు నిర్మించారు. ఆక్రమణలతో బుడమేరు పిల్ల కాలువను తలపిస్తోంది.


ఇవీ... సింగ్‌నగర్ వంతెన సమీపంలో బుడమేరు ఆక్రమణలు. కాలువ సగం వరకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. వరద వస్తే ఇక్కడ నుంచి 3000 క్యూసెక్కులు కూడా బయటికి వెళ్లవు. కనీసం ఆక్రమణదారులకు నోటీసులు కూడా ఇవ్వలేదు.

ఆగస్టు 31 2024..

బుడమేరు కట్ట తెంచుకుని విరుచుకుపడింది. వరద ఉగ్రరూపానికి బెజవాడ గజగజలాడింది. నగరవాసులు గుండెలు గుప్పిట పెట్టుకుని పది రోజులు బిక్కుబిక్కుమని బతికారు. విజయవాడ చరిత్రలో ఎన్నడూ లేనంతగా భయంకరంగా ముంచుకొచ్చిన జల ప్రళయంలో ఏకంగా పదుల మంది కొట్టుకుపోయారు. ఇంతటి ఉపద్రవానికి ఊహించని వరదలు, భారీ వర్షాలు తోడయ్యాయి. గట్టు బలహీనత, బుడమేరు పొడవునా అడ్డగోలు ఆక్రమణలూ శాపాలయ్యాయి. ఆక్రమణల అంతు చూస్తామని ప్రభుత్వం ప్రకటించినా కార్యాచరణ కానరాలేదు. మరోమారు విపత్తు దూసుకొస్తే పరిస్థితి ఏంటనే ఆలోచనే ప్రతి గుండెను కలవరపెడుతోంది.

– ఈనాడు, అమరావతి


ఇవన్నీ.. నందమూరినగర్‌లో ఆక్రమణలు.. ఇక్కడ ఓ వైపు నుంచి బుడమేరు ఆక్రమించి ఇళ్లు కడుతుంటే.. మరోవైపు సాగు చేస్తున్నారు. రెండేళ్ల కిందట వరదలు వచ్చిన తర్వాత 20 శాతం ఆక్రమణలు పెరిగాయి. అయినా పట్టించుకున్న నాథుడు లేరు.

బెజవాడ భద్రత ప్రశ్నార్థకమే...

ఇప్పటికిప్పుడు ఆక్రమణలన్నీ తొలగించి ప్రక్షాళన చేయడం సాధ్యం కాకపోవచ్చు.. కానీ ప్రమాదం లేకుండా చర్యలు తీసుకోవాలి. నగరంలో కాలువల ప్రవాహ సామర్థ్యం 7,000-10,000 క్యూసెక్కులు, వెడల్పు 50 మీటర్లు ఉంటేనే వరదల వేళ నగరానికి ముప్పు ఉండదు. ప్రస్తుతం 50-120 మీటర్ల మధ్యలో ఉండాల్సిన బుడమేరు వెడల్పు 20-30 మీటర్లే ఉంది. ప్రవాహ సామర్థ్యం 17 వేల క్యూసెక్కులు కాగా 2,000-4,000కు పడిపోయింది. కొత్త ఆక్రమణలు పెరుగుతూనే ఉన్నాయి. భవిష్యత్తులో వరదలు వస్తే బెజవాడ భద్రత ప్రశ్నార్థకమే.

380 ఎకరాల్లో పాగా...

బుడమేరు పరివాహక ప్రాంతం 2,930 ఎకరాలు. విజయవాడ గ్రామీణంలో 300 ఎకరాల బుడమేరు వాగును ఆక్రమించి సాగు చేస్తున్నారు. సింగ్ నగర్, నందమూరినగర్, న్యూరాజరాజేశ్వరీ పేటల్లో 80 ఎకరాలు ఆక్రమించారు. వీటిలో 3,051 నిర్మాణాలున్నాయి. 750 అపార్టుమెంట్లు, 2,000 గృహాలు, 300 వ్యాపార కేంద్రాలు, దుకాణాలు, ఇతర నిర్మాణాలున్నాయి. వీటి విలువ రూ.800 కోట్ల పైమాటే. పాత ఆక్రమణలేకాదు... రెండేళ్లలో వందల్లో కొత్త ఆక్రమణలొచ్చాయి. ఆక్రమణలు తొలగింపు, నిర్వాసితులకు పరిహారం, పునరావాసానికి స్థలం ఇవ్వటం లేదా ఇళ్లు కట్టించేందుకు రూ.5,222 కోట్లు అవసరమని డీపీఆర్‌ను సిద్ధం చేశారు. అధిక వ్యయం కావటంతో ముందుకెళ్లలేదు.

నిధి.. సందడి



సినీ నటి నిధి అగర్వాల్ సందడి చేశారు. ఆదివారం మండలంలో తరకటూరులో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి ఆమె హాజరవగా అభిమానులు సెల్ఫీలు తీసుకునేందుకు ఉత్సాహం చూపారు.. - **గూడూరు, న్యూస్‌టుడే**

పాడి ప్రగతికి రక్షణ ఛత్రం

ఉమ్మడి జిల్లాలో 1,793 మినీ గోకులాలు

నిర్మాణానికి రూ.35.86కోట్ల నిధుల మంజూరు


ప్రభుత్వ రాయితీతో నిర్మించిన గోకులం షెడ్డు

షెడ్డు సామర్థ్యం	ఖర్చు	ప్రభుత్వ వాటా	రైతు వాటా
రెండు పశువులు	1,15,000	1,03,500	11,500
నాలుగు "	1,85,000	1,66,500	18,500
ఆరు "	2,30,00	2,07,000	23,000
20 గొర్రెలు	1,30,000	91,000	39,000
50 గొర్రెలు	2,00,000	1,31,000	69,000
100 కోళ్లు	87,000	60,900	26,100
200 కోళ్లు	1,32,000	92,400	39,600

ఈనాడు, అమరావతి

కూటమి ప్రభుత్వం 2026-27 ఆర్థిక ఏడాదికి ఉమ్మడి జిల్లాలో 1,793 మినీ గోకులాలను మంజూరు చేసింది. దీనికి ప్రభుత్వం రూ.35.86 కోట్ల వరకు నిధులు కేటాయించింది. ఇప్పటికే అధికారులు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మొదలు పెట్టారు. దరఖాస్తులు స్వీకరించి గ్రామ సభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.

10 శాతమే..: రైతులు పెంచుతున్న పశువులను బట్టి మూడు రకాల షెడ్లు నిర్మిస్తారు.. ఏ రకం షెడ్డు నిర్మించినా ప్రభుత్వం 90 శాతం నిధులు ఇస్తుంది. వీటిని ప్రభుత్వం వీబీజీ రామ్‌జీ నిధుల నుంచి సమకూరుస్తుంది. మిగిలిన 10 శాతం ఖర్చు రైతులు చెల్లించాలి. మొత్తం షెడ్డుల్లో చిన్న మండలాలకు 35, పెద్ద మండలాలకు 50 షెడ్ల వరకు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు...

★ రెండు పశువులకు రూ.11.50వేలు, నాలుగు పశువులకు రూ.18.50వేలు, ఆరు పశువులకు రూ.23వేలు రైతు వాటా చెల్లిస్తే సరిపోతుంది. ప్రస్తుతం రెండు జిల్లాల్లో అర్హతలను బట్టి లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. పశువులున్నట్లు పశుసంవర్ధక శాఖ నుంచి ధ్రువీకరణ పత్రం అందజేయాలి. పూర్తి చేసిన దరఖాస్తును ఎంపీడీవోకి సమర్పించాలి. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ తర్వాత అధికారులు గ్రామ సభలు పెట్టి అర్హులను ఎంపిక చేస్తారు.

★ పశువులకు మాత్రమే కాకుండా గొర్రెలు, కోళ్లకు సైతం షెడ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. ఎంపికలో చిన్న, సన్నకారు రైతులకు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. నిర్మాణంలో వృథా ఖర్చులు తగ్గించి.. ఆ సొమ్ముతో రెండు సీలింగ్ ఫ్యాన్లు, దోమ తెర కూడా అందించనున్నారు.



నిధులు పక్కదారి.. నీళ్లు రంగుమారి

సామూహిక రక్షిత మంచినీటి పథకాల నిర్వహణపై ఆరోపణలు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

ప్రజలకు తాగునీరు అందించే పథకాలపై ప్రస్తుతం పర్యవేక్షణ కొరవడింది. చాలా చోట్ల సక్రమంగా శుద్ధిచేయకుండానే సరఫరా చేయడం, సకాలంలో లీకులకు మరమ్మతులు చేయకపోవడంతో నీరు రంగుమారి సరఫరా అవుతోంది. ఆ పథకాల నిర్వహణకు కేటాయించే నిధులు కూడా పక్కదారి పడుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


అధ్వానంగా బంటుమిల్లి మండలంలోని ఫిల్టర్‌బెడ్డు

పథకాలు ఎన్ని.. ఇచ్చే సొమ్ము ఎంత..

జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గాల పరిధిలో 18 సామూహిక రక్షితనీటి పథకాలున్నాయి. పెడన మండలం ఉప్పలకలవగుంట, గూడూరు మండలంలోని ముక్కొల్లు, బంటుమిల్లి మండలంలో మల్లేశ్వరం, చోరంపూడి, కృత్తివెన్ను మండలంలో సీతనపల్లి, బందరు మండలంలో ఆకుమర్రు, మంగినపూడి, అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలో కమ్మనమోలు, పెదకమ్మవారిపాలెం, రామచంద్రపురం, ఎదురుమొండి, దింటిమెరకతోపాటు గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లోని వివిధ సామూహిక రక్షితనీటి పథకాలు ఉన్నాయి. వీటి నిర్వహణకు సంబంధించి 2025-26 సంవత్సరానికి రూ.15.61 కోట్లు కేటాయించారు. వీటిలో రూ.5.82కోట్లు విద్యుత్తు ఛార్జీల నిమిత్తం, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కింద రూ.9.78 కోట్లు ఇచ్చారు. 2026-27 రూ.16.35కోట్లు కేటాయిస్తున్నట్లు ఇటీవల నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో వెల్లడించారు.

ఇదీ పరిస్థితి..

బంటుమిల్లి మండలంలోని పథకాలకు అనుసంధానంగా ఉన్న చెరువులు పాడైపోవడం, సక్రమంగా శుద్ధిచేయకపోవడంతో నీరు రంగుమారి సరఫరా అవుతోందని ఆ ప్రాంత ప్రజలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కృత్తివెన్ను మండలంలోని సీతనపల్లి రక్షితనీటి పథక నిర్వహణ సక్రమంగా ఉండడం లేదని, తాగునీరు కూడా తరచుగా రంగుమారి వస్తోందని వివిధ గ్రామాల ప్రజలు వాపోతున్నారు. పెడన మండలంలోని ఉప్పలకలవగుంట సామూహిక రక్షిత నీటి పథకం ద్వారా 21 గ్రామాలకు నీరు సరఫరా అవుతుంది. చెరువు అధ్వానంగా మారడంతోపాటు తరచుగా లీకులు ఏర్పడుతున్నాయి. ఒక వ్యక్తి మాత్రం నీరు వదులుతూ ఉంటారు. మిగిలిన సిబ్బంది ఎక్కడ ఉంటారో తెలియని గ్రామస్థులు చెబుతున్నారు. అన్ని పథకాలూ ఇలాగే తయారయ్యాయి. ఇవి ప్రజలకు పూర్తిస్థాయిలో అక్కరకు రాకపోగా ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నందున ఉన్నతాధికారులు ఇప్పటికైనా దృష్టిసారించాలని కోరుతున్నారు.

రికార్డుల్లో మాత్రమే..

సామూహిక రక్షితనీటి పథకాల నిర్వహణ బాధ్యతలను గుత్తేదారులకు కేటాయిస్తారు. వారు ఆయా పథకాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు శుద్ధి జలాన్ని అందించాలి. ఒక్కో పథకానికి వాటి సామర్థ్యాన్ని బట్టి 10 నుంచి 30 మంది వరకు సిబ్బంది ఉండాలి. కానీ ప్రస్తుతం ఆ దిశగా ఎక్కడా లేరని గ్రామీణ నీటి సరఫరా విభాగ కార్యాలయ వర్గాలే చెబుతున్నాయి. కానీ రికార్డుల్లో మాత్రం పూర్తిస్థాయి సిబ్బంది ఉన్నట్లు లెక్క చూపించి నిధులు నొక్కేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సజావుగా నీట్ పీజీ- 2026 ప్రవేశ పరీక్ష


వరుసలో నిల్చున్న అభ్యర్థులు

కానూరు, న్యూస్‌టుడే : ఉమ్మడి కృష్ణా జిల్లాలో నాలుగు పరీక్షా కేంద్రాల్లో నీట్ పీజీ- 2026 ప్రవేశ పరీక్ష సజావుగా ముగిసింది. పరీక్షకు హాజరైన వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత, విద్యుత్తు, తాగునీరు తదితరాలను అందుబాటులో ఉంచడంతో ప్రశాంత వాతావరణంలో పరీక్ష జరిగింది. విజయవాడలోని పొట్టిశ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో, ఎనికేపాడులోని శ్రీవిజయదుర్గ ఐటీ ఇన్ఫో సొల్యూషన్స్ సెంటర్‌లో, కృష్ణా జిల్లా కానూరు ఐయాన్ డిజిటల్ సెంటర్, ధనేకుల ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్ష నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లాలోని రెండు పరీక్షా కేంద్రాల్లో 843 అభ్యర్థులకు 818 మంది హాజరుకాగా, కానూరు ఐయాన్ డిజిటల్ సెంటర్లో 1560 మందికి 1530, గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కళాశాలలో 306 మందికి 299 అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ నగరంలోని పొట్టిశ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని సందర్శించి, ఏర్పాట్లు పరిశీలించారు.

నీటి విడుదల

ఎన్టీఆర్ కలెక్టరేట్: బ్యారేజీ నుంచి పంట కాలువలకు ఆదివారం 9,302 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు కాలువకు 5,118, పశ్చిమకు 4,012, గుంటూరు ఛానల్‌కు 172 క్యూసెక్కులు ఇస్తున్నారు. తూర్పు కాలువ నుంచి రైవస్ కాలువకు 2,005, ఏలూరుకు 1,302, కేఈబీకి 906, బందరు కాలువకు 905 క్యూసెక్కులిచ్చారు. బ్యారేజీ వద్ద 12 అడుగుల మట్టం ఉంది.

2న జిల్లా స్థాయి కిసాన్ మేళా

కంకిపాడు, న్యూస్‌టుడే : వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబరు 2న కంకిపాడు మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న శ్రీకృష్ణా కల్యాణ మండపంలో జిల్లా స్థాయి 'అగ్రి ఎక్స్‌పో- కిసాన్ మేళా- 2026' జరుగుతుందని కంకిపాడు మండల వ్యవసాయాధికారిణి ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో వ్యవసాయ, అనుబంధ విభాగాలకు చెందిన ఆధునిక యంత్ర పరికరాలు, ఉత్పత్తులు, నూతన డ్రోన్లు, వంగడాల ప్రదర్శన, శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారుల సూచనలు, పథకాలపై అవగాహన సదస్సు ఉంటాయని చెప్పారు.



కనిపెట్టే కన్ను.. కొరవడింది దన్ను

- కీలక ప్రాంతాల్లో లేని సీసీ కెమెరాలు
- కొలిక్కిరాని కేసులు


రామవరప్పాడు, నిడమానూరు, న్యూస్‌టుడే

జాతీయ రహదారిపై వరుస ప్రమాదాలు జరుగుతున్నా కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై నిర్లక్ష్యం చోటుచేసుకుంది. పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో రామవరప్పాడు నుంచి గూడవల్లి వరకు జాతీయ రహదారిపై పలుచోట్ల సీసీ కెమెరాలు లేకపోవడంతో ప్రమాదాలకు కారణమైన వాహనాలను గుర్తించడం పోలీసులకు సవాల్‌గా మారింది.

ఇదీ పరిస్థితి..: రామవరప్పాడు నుంచి ఎనికేపాడు వరకు జాతీయ రహదారిపై సరిపడా సీసీ కెమెరాలు ఉండటంతో పెద్ద పెద్ద కేసులు సైతం గంటల వ్యవధిలోనే ఛేదిస్తున్నారు. కానీ నిడమానూరు నుంచి గూడవల్లిలోని బుడమేరు వంతెన వరకు సీసీ కెమెరాలు లేవు. గూడవల్లి సెంటర్‌లో ఉన్న కెమెరాలు కొన్ని రోజులు పని చేస్తే కొన్ని రోజులు పని చేయట్లేదు. జాతీయ రహదారిపై ఉన్న హోటళ్లు, దుకాణాల నిర్వాహకులు ఏర్పాటు చేసుకున్న కెమెరాలు రోడ్డు వైపు కూడా కవర్ అయ్యేలా ఏర్పాటు చేయమని పోలీసులు చేస్తున్న సూచనలను విస్మరిస్తున్నారు. నిడమానూరు బ్రిడ్జికి ఇరువైపులా, నిడమానూరు వాల్వో జంక్షన్, మిత్రా దాబా వద్ద, గూడవల్లి సెంటర్, కేకేఆర్ గౌతమ్ స్కూల్, బుడమేరు వంతెనకు ఇరువైపులా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

ఏడు నెలలైనా ఆచూకీ లేదు..

ఉంగుటూరు మండలం తేలప్రోలుకు చెందిన తంబికుమార్ ఈ ఏడాది జనవరి 25న రాత్రి 12 గంటల సమయంలో విజయవాడ నుంచి తేలప్రోలుకు తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. నిడమానూరు బ్రిడ్జి దిగుతుండగా గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి తంబికుమార్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా అతడు ఫుట్‌పాత్‌పై ఉన్న మొక్కల్లో పడ్డాడు. ఈ ప్రమాదంలో అతని కాలు విరగడంతో పాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై పటమట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిడమానూరు బ్రిడ్జిపై సీసీ కెమెరాలు లేకపోవడంతో 7 నెలలు దాటినా ప్రమాదానికి కారణమైన వాహనం ఆచూకీ దొరకలేదు.



బీఎల్వోలు లేక.. జనం తిరిగెళ్లిపోయారు

గుడివాడ, న్యూస్‌టుడే

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ(సర్)లో భాగంగా ఈనెల 29, 30 తేదీలలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని ప్రభుత్వ యంత్రాంగం నిర్వహించింది. కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, వేరే ప్రాంతానికి ఓటు మార్పు వంటి వాటికి సంబంధించి బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్వోలు) ఆయా పత్రాల్ని స్వీకరించారు. గుడివాడ పట్టణంలో మొత్తం 118 పోలింగ్ బూత్‌లు ఉండగా.. చాలా చోట్ల బూత్ స్థాయి అధికారులు ఆదివారం కానరాలేదని 'ఈనాడు' పరిశీలనలో తేలింది. బూత్‌లకు పలు చోట్ల తాళాలు వేసి ఉన్నాయి. మరి కొన్నిచోట్ల బీఎల్వోలు కనిపించక పోవడంతో ఓటర్లు వెనుదిరిగి పోయారు. పేద, మధ్య తరగతి వర్గాల వారు ఇళ్లను తరచూ మారుతుండటంతో అధికసంఖ్యలో ఫారం 8ను సమర్పించేందుకు పోలింగ్ బూత్‌ల చుట్టూ తిరిగారు. కొన్ని బూత్‌లలోని వివరాలు పరిశీలిస్తే...



ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలోని పోలింగ్ బూత్ వద్ద బీఎల్వోతో మాట్లాడుతున్న ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం

పోలింగ్ బూత్‌ల వద్ద పరిస్థితులపై 'ఈనాడు' పరిశీలన

12:10 మధ్యాహ్నం ★ గుడ్‌మెన్‌పేట ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ బూత్ 109లో బీఎల్వో ఎం.వెంకటేశ్వరరావు, 110లో పి.బల్లి, 111లో రుక్సానా బేగంలు ఓటర్లకు సేవలు అందించారు.

12:20 ★ గుడ్‌మెన్‌పేట నంబర్ 2 ప్రాథమిక పాఠశాల గేటుకు తాళాలు వేశారు. ఇక్కడ రెండు పోలింగ్ బూత్‌లు ఉన్నాయి.



12:25 ★ ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు బాలికోన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఒక్క బీఎల్వో కూడా కనిపించలేదు. అక్కడ నిర్మాణ పనుల్లో నిమగ్నమైన తాపీ కార్మికులు ఉదయం నుంచి ఎవ్వరూ ఇక్కడికి రాలేదని చెప్పారు.



12:30 ★ గాంధీ పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో 125వ పోలింగ్ కేంద్రంలో బీఎల్వో బి.ఉదయలక్ష్మి మాత్రమే ఉన్నారు. 126వ పోలింగ్ కేంద్రం బీఎల్వో భాగ్యలక్ష్మి కనిపించలేదు.

12:40 ★ ఎస్పీఎస్ పురపాలక ఉన్నత పాఠశాల 146వ పోలింగ్ బూత్‌లో బీఎల్వో సుజశ్రీ మాత్రమే కనిపించారు. 145వ బూత్‌లో బీఎల్వో కోటి మెడికల్ లీవులో ఉన్నారని తెలిసింది. కానీ అతడికి బదులుగా నియమితులైన వారు కనిపించలేదు.

12:45 ★ ఏజీకే పురపాలక ఉన్నత పాఠశాలలో నాలుగు పోలింగ్ కేంద్రాలున్నాయి. బీఎల్వోలు 149వ పోలింగ్ బూత్‌లో గణేష్, 150లో విజయ్ కృష్ణ ఉన్నారు. 147, 148ల బీఎల్వోలు కనిపించలేదు.

12:54 ★ రాజేంద్రనగర్ (పార్కు) ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ బూత్ 58లో ప్రసాద్, 59లో శిరీష ఓటర్ల నుంచి దరఖాస్తుల్ని స్వీకరించారు.



1:10 ★ నీలామహల్ రోడ్డులోని పురపాలక ప్రాథమిక పాఠశాల (అల్లంబడి)లో 54వ బూత్‌లో వెంకటేష్ అందుబాటులో ఉండగా 55లో బీఎల్‌వో ప్రసాద్ కన్పించలేదు.


తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని చెప్పాం

– జి.బాల సుబ్రహ్మణ్యం, ఎన్నికల అధికారి, ఆర్డీవో

బీఎల్వోలు ఈ రెండు రోజులూ పోలింగ్ బూత్‌ల వద్ద అందుబాటులో ఉండాలని ఆదేశించాం. ఒక కేంద్రంలో ఎన్ని బూత్‌లు ఉన్నా కనీసం ఒకరైనా అందుబాటులో ఉండాలని, మిగిలిన వారు కూడా ఫీల్డులో ఉండాలని సూచించాం. నేను ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియం, ఆంధ్ర నలంద పురపాలక ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాల్ని పరిశీలించా.

జలకాలాటలో.. చిరుచిరు జల్లులతో..

ఆధునిక సమాజంలో అన్నీ మారుతున్నట్లుగానే పశుపోషణలోనూ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. కొందరు పశుపోషకులు సకల వసతులతో కూడిన షెడ్లు, దోమల బెడద నివారణకు వీలుగా భారీ పంకాలు, గేదెలు పడుకునేందుకు మ్యాట్లు వాడుతున్నారు. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం వీరవల్లికి చెందిన చిలకపాటి రాజీవ్ పదేళ్ల క్రితమే లండన్‌లో ఉద్యోగం వదిలి స్వగ్రామంలో హరియాణా జాతి గేదెలు, దున్నలతో డెయిరీ ఫాం, సెమన్ బ్యాంకు పెట్టారు. 200కు పైగా పశువులతో పూర్తి అధునాతన విధానంలో వీటిని నిర్వహిస్తున్నారు. రోజూ వీటికి స్నానం చేయించి, శుభ్రం చేసేందుకు వీలుగా ఇటీవల రూ.5 లక్షల వ్యయంతో షవర్ సిస్టమ్ అమర్చారు. పశువులు వరస క్రమంలో దీనిలోకి ప్రవేశించగానే అన్ని వైపుల నుంచి అధిక పీడనంతో నీటి ధారలు వచ్చేలా ఏర్పాటు చేశారు. పాలు పితకడానికి ముందు కచ్చితంగా వీటికి షవర్ స్నానం చేయించేలా చర్యలు తీసుకున్నారు.



షవర్ మార్గంలో బయటకొస్తున్న గేదెలు

– హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

దుర్గమ్మకు బంగారు జడ విరాళం



అధికారులు, కుటుంబసభ్యులతో కలిసి జడను తీసుకువస్తున్న దాత రాధాకృష్ణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: జగన్మాత దుర్గమ్మ అలంకరణ నిమిత్తం రూ.11లక్షల విలువైన బంగారు జడను దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ(గాంధీ) కుటుంబం ఆదివారం విరాళంగా అందజేశారు. లక్ష్మీదేవి, ఇతర దైవిక రూపాలు కలిగిన బంగారు జడలో ఆకుపచ్చ రంగు విలువైన రాళ్లు, ముత్యాలు పొదిగి ఉన్నాయి. ఈ సందర్భంగా ఛైర్మన్ రాధాకృష్ణ మాట్లాడుతూ.. 20 ఏళ్ల క్రితం దుర్గగుడికి వచ్చినప్పుడు అమ్మవారికి బంగారు జడ చేయించాలన్న ఆలోచన వచ్చిందన్నారు. అప్పుడు చేసిన సంకల్పం దుర్గగుడి ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కుటుంబ సభ్యులు, మిత్రుల సహకారంతో అమ్మవారి మొక్కును విజయవంతంగా నెరవేర్చానన్న సంతృప్తి కలిగిందన్నారు. ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తనతో పరిచయం ఉన్న మిత్రులు స్వచ్ఛందంగా శివాలయం అభివృద్ధి, అన్నదానం, ఉచిత ప్రసాదం, బంగారం, వెండి ఆభరణాలు, గోసంరక్షణ పథకాలకు రూ.1.16 కోట్ల విరాళాలు తన హయాంలో అమ్మవారి ఆలయానికి అందజేశారని తెలిపారు. మరో 15 రోజుల్లో రూ.75లక్షల విలువ చేసే బంగారు కిరీటం(డైమండ్స్ పొదిగిన) అమ్మవారికి విరాళంగా ఇచ్చేందుకు తన మిత్రుడు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. దేవస్థానం ఈవో శీనానాయక్, స్థానాచార్య శివప్రసాదశర్మ, ప్రధానార్చకులు దుర్గాప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు కోట ప్రసాద్, శ్రీధర్‌శర్మ, ఈఈ రమాదేవి, పాలకమండలి సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, రాఘవరాజు, సరిత తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భువన విజయం



విజయవాడ సాంస్కృతికం : దృశ్య వేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం ప్రదర్శించిన 'భువన విజయం' నాటకం అలరించింది. శ్రీకృష్ణదేవరాయలుగా అంబటి మధుమోహనకృష్ణ, తిమ్మరుసుగా యల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి, అల్లసాని పెద్దనగా గుమ్మా సాంబశివరావు తదితరులు తమ పాత్రలను చక్కగా పోషించారు తెలుగు భాషా సాహిత్య వైభవాన్ని భావితరాలకు పరిచయం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

కొత్తగా 239 భాగస్వామి పింఛన్ల మంజూరు

మోపిదేవి, న్యూస్‌టుడే: జిల్లాకు కొత్తగా 239 భాగస్వామి పింఛన్లు మంజూరయ్యాయి. దంపతులలో ఎవరైనా పింఛను తీసుకుంటూ మృతిచెందితే వారి పింఛనును ఎవరైతే భౌతికంగా ఉన్నారో వారికి వర్తించేలా కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. దీంతో ఆ కుటుంబాలకు పింఛను ద్వారా కొంత ఆర్థిక భరోసా కల్పించినట్లు అవుతోంది. వచ్చే నెలకి సంబంధించి అత్యధికంగా తాడిగడప మున్సిపాలిటీలో 25, గూడూరుకు 19, బాపులపాడు 16కు మంజూరయ్యాయి. అతి తక్కువగా ఘంటసాల 2, గుడ్లవల్లేరు, కంకిపాడు, పెడన అర్బన్, పెనమలూరు మండలాలకు 3 చొప్పున కేటాయించారు. పెడన మండలం, తోట్లవల్లూరు మండలాలకు 4 చొప్పున, మోపిదేవికి 11 పింఛన్లు మంజూరైనట్లు అధికారులు ఆదివారం తెలిపారు.

అనుమతుల్లేవ్... అయినా తవ్వేస్తున్నారు

చెరువులుగా మారుతున్న బీడు పొలాలు

కోడూరు - న్యూస్‌టుడే

ఐదేళ్లుగా సముద్రపు పోటుకు ఉప్పునీటి ప్రభావంతో వరిపంట సాగుకు దూరమైన బీడుబారిన పొలాలు నేడు చెరువులుగా మారిపోతున్నాయి. దివిసీమ కోడూరు మండలంలో దింటిమెరక - పాలకాయతిప్ప మధ్య 16, 17 పంట కాల్వల కింద ఉన్న కుడి వైపు సుమారు 3వేల ఎకరాలు పంట విరామంతో బీడుగా మారాయి. పాలకాయతిప్ప కరకట్ట వద్ద శిథిలమైన అవుట్‌ఫాల్ స్లూయిస్ కారణంగా సముద్రపు పోటునీరు గ్రామం వైపు చొచ్చుకు వచ్చి పొలాల్లోకి రావడంతో రైతాంగం వరిపంటను నష్టపోతోంది. ఆ ప్రాంతంలో గత ఐదేళ్లుగా పంట విరామం ప్రకటించి ప్రభుత్వాన్ని సముద్రపు నీరు పంటల వైపు రాకుండా నూతన అవుట్‌ఫాల్ స్లూయిస్ నిర్మించాలని రైతులు కోరుతున్నారు. కోడూరు, నాగాయలంక మండలాల్లో ఇలాంటి వాటిని గుర్తించి నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపామని ఉన్నతాధికారులు ఇటీవల ఆయా ప్రాంతాలను పరిశీలించడానికి వచ్చినప్పుడు ప్రకటించారు. అయితే.. అది ఎంతవరకు కార్యరూపం దాల్చిందో తెలియదు కానీ, ఈక్రమంలో ఐదేళ్లుగా పంట పండించలేని ఆ ప్రాంత రైతులు వ్యవసాయ కూలి పనులకు వెళ్తూ కుటుంబాలను పోషించుకుంటూ వస్తున్నారు. మళ్లీ వరి పంటను పండించుకునే ఆశ వదులుకున్న కొంతమంది బయటి ప్రాంతాల నుంచి వచ్చిన మోతుబరి రైతులకు వారి చిన్న కమతాలను కౌలుకు ఇచ్చివేస్తున్నారు. దీంతో మోతుబరులు ఆ పొలాలను ఎలాంటి అనుమతుల్లేకుండా పొక్లెయిన్ల సాయంతో చెరువులుగా మార్చుస్తున్నారు. మండల కేంద్రానికి కిలోమీటరు నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ చెరువులు తవ్వేస్తున్న విషయం ఇటు రెవెన్యూ శాఖాధికారులకు, అటు మత్స్యశాఖాధికారులకు తెలియలేదనడం గమనార్హం. దింటిమెరక - పాలకాయతిప్ప మధ్య పదుల సంఖ్యలో పొక్లెయిన్లు రెండు ప్రాంతాల్లో చెరువుల తవ్వకం పనుల్లో నిమగ్నమయ్యాయి. సొంత పొలాలు ఉన్న రైతులు పంటలు పండక ఐదేళ్లుగా నష్టపోతున్న క్రమంలో ఇలా పెద్ద రైతులకు చెరువుల్ని కౌలుకు ఇచ్చుకుని కుటుంబ పోషణకోసం ఆర్థిక భరోసాను పొందుతున్నారనే మాటలు వినిపిస్తున్నాయి. బీడు భూముల్లో చెరువుల తవ్వకాల విషయం గురించి 'న్యూస్‌టుడే' కోడూరు మండల తహసీల్దార్ కేవీ.పూర్ణచంద్రరావును, మత్స్యశాఖ అభివృద్ధి అధికారిణి వేదమణిని వివరణ కోరగా చెరువుల తవ్వకాలకు అధికారికంగా ఎలాంటి అనుమతులూ ఇవ్వలేదని, ఆ చెరువులు తవ్వే ప్రాంతాన్ని పరిశీలిస్తామని బదులిచ్చారు.



శిథిలావస్థకు చేరిన అవుట్‌ఫాల్ స్లూయిస్



పొలాల్ని పొక్లెయిన్లతో చెరువులుగా తవ్వేస్తున్నారిలా..

యూటీఎఫ్ ఉద్యమ ఫలితమే అప్రెంటిస్ విధానం రద్దు

చల్లపల్లి, న్యూస్‌టుడే: యూటీఎఫ్ ఉద్యమాల వల్లనే ఉపాధ్యాయ వ్యవస్థలో అప్రెంటిస్ విధానం రద్దయిందని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కృష్ణా జిల్లా శాఖ మధ్యంతర కౌన్సిల్ సమావేశాన్ని చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో యు.టి.ఎఫ్. బలపరచిన పి.డి.ఎఫ్. అభ్యర్థి ఎం.హనుమంతరావును గెలిపించాలని కోరారు. శాసనమండలిలో మన సభ్యులు ఉంటే ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలు చేస్తారని చెప్పారు. ఉపాధ్యాయులు టెట్ పరీక్ష రాసే విధానంలో గందరగోళం నెలకొంటే విద్యా శాఖ మంత్రి కనీసం స్పందించిన దాఖాల్లేవని చెప్పారు. తమిళనాడు ముఖ్యమంత్రి టెట్ పరీక్షను ఆఫ్‌లైన్‌లో పెట్టేవిధంగా తీర్మానం చేస్తే, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కనీసం పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు. యు.టి.ఎఫ్.రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టెట్ విషయంలో సమస్యల సాధన కోసం సెప్టెంబరు 3వ తేదీన నిర్వహించనున్న ఛలో విజయవాడ కార్యక్రమానికి ఉపాధ్యాయులు భారీగా హాజరై విజయవంతం చేయాలన్నారు. డిసెంబరులో మచిలీపట్నంలో జరిగే రాష్ట్ర కౌన్సిల్ మహాసభలకు యు.టి.ఎఫ్.రాష్ట్ర కార్యదర్శి ఎస్.పి.మనోహర్‌కుమార్ సేకరించిన రూ.50వేలను జిల్లా శాఖకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం.హనుమంతరావు, యు.టి.ఎఫ్.జిల్లా అధ్యక్షుడు ఎం.డి.షౌకత్ హుస్సేన్, మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి కె.ఎ.ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కనకారావు, ఉపాధ్యాయ నేతలు ఎస్.పి.మనోహర్‌కుమార్, కె.వినోద్‌బాబు, పి.ఎస్.ఆర్.మూర్తి, ఎం.విజయశ్రీ, జి.వి.తాతారావు, ఎన్.వెంకటేశ్వరరావు, తమ్మిశెట్టి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు

ఆర్థిక సంక్షోభంలో చేనేత సొసైటీలు

2న మంగళగిరిలో ఐకాస సమావేశం

పెడన, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని చేనేత సహకార సొసైటీలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని చేనేత ఐక్యకార్యాచరణ సమితి జాతీయ అధ్యక్షుడు బండారు ఆనంద ప్రసాద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత కొన్నేళ్లుగా సొసైటీలకు విడుదల చేయాల్సిన నిధులను నిలిపివేయటంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. పెడనలో ఆదివారం ఏపీ ఐక్య కార్యాచరణ సమితి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సొసైటీలకు వివిధ పద్దుల కింద రూ.203 కోట్లు విడుదల కావాల్సి ఉందని, వీటికి అదనంగా రుణమాఫీకి సంబంధించి రూ.46.19 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సొసైటీలు దాదాపు మూతపడ్డాయని కృష్ణా జిల్లాలో అక్కడక్కడ ప్రైవేటు మార్కెట్‌పై ఆధారపడి నడుస్తున్నాయన్నారు. ఈనేపథ్యంలో సెప్టెంబరు 2న మంగళగిరిలో రాష్ట్ర స్థాయి ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఇందులో ప్రధానంగా ఆప్కో పటిష్ఠత, చేనేత రంగులు, రసాయనాలు, నూలుకు జీఎస్టీ మినహాయింపు తదితర సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ సిద్ధం చేస్తామన్నారు. చేనేతల సేవలో పథకాన్ని ఆహ్వానిస్తున్నా.. ఆ ఒక్క పథకంతోనే పరిశ్రమ పురోగతి చెందదని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో చేనేత నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ, కట్టా హేమసుందర్రావు, కట్టా శివ దుర్గారావు, గోరు రాజు, పంచల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జిల్లాలోని పోలవరం, కప్పలదొడ్డి, కాజ, రాయవరం తదితర చేనేత కేంద్రాల్లో పర్యటించిన నాయకులు 2న మంగళగిరి తరలిరావాలని విజ్ఞప్తిచేశారు.



పెడనలో సమావేశమైన ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమే

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోరంకిలోని ఎస్ఆర్‌కే టెన్నిస్ అకాడమీలో ఉమ్మడి కృష్ణా జిల్లా అండర్-10, 14 బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. ప్రముఖ వైద్యులు ఎస్.రామకృష్ణ, ఎన్టీఆర్ జిల్లా సంఘం అధ్యక్షుడు వై.బాబూరావు, కార్యదర్శి ఈడె లలిత్‌కుమార్, పి.రామ్‌కుమార్, కోచ్ వై.శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. అండర్-10 బాలుర విభాగంలో సీహెచ్ ఆశ్రిత్, జతిన్ చంద్ర, కె.సురార్‌చిత్, కె.భువన్, అర్జున్‌రెడ్డి, బాలికల విభాగంలో ఇస్సాక్ ప్రజ్ఞయ, వి.హస్విక శృత, ఎం.జనహిత, బి.నాగసాయి నేహ శరణ్య, ఆర్.తన్మయి, అండర్-14 బాలుర విభాగంలో యు.సాయి శౌర్య, ఎస్.నిహాల్ రాజారామ్, శ్రీమల్లేశ్వరరెడ్డి, వై.క్రిష్, షేక్ తాంజీల్, బాలికల విభాగంలో జి.మోక్ష, టి.లలిత, పి.వంసిత, పీయూష, ఎస్.రాగరిషికలు జిల్లా జట్లలో స్థానం సాధించారని జిల్లా సంఘం కార్యదర్శి లలిత్‌కుమార్ ప్రకటించారు.



ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టుకు ఎంపికైన అండర్-14 బాలబాలికలు

బాడీ బిల్డింగ్‌తో జాతీయ గుర్తింపు

గుడివాడ, న్యూస్‌టుడే: బాడీ బిల్డింగ్ ద్వారా జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. కృష్ణా జిల్లా గుడివాడలోని ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో ఎన్టీఆర్ మెమోరియల్ ఆంధ్రప్రదేశ్ ఓపెన్ బాడీబిల్డింగ్ పోటీలు ముగిశాయి. ఈసందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం ఏర్పడుతుందన్నారు. నేటి సమాజంలో తగిన వ్యాయామం లేక చాలా మంది జీవన శైలి వ్యాధులతో బాధపడుతున్నారన్నారు. స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టేడియంలో 14 క్రీడాంశాలలో ఏడాది పొడవునా శిక్షణ ఇస్తూ జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ పోటీలలో మిస్టర్ ఆంధ్రప్రదేశ్ టైటిల్‌ను ఏలూరు జిల్లాకు చెందిన కె.పూర్ణచంద్రరావు, ద్వితీయ స్థానాన్ని పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఎస్.నాగేంద్ర కైవశం చేసుకున్నారు. విజేతలకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, సభ్యులు వల్లభనేని లక్ష్మీవరప్రసాద్, ప్రవీణ్ కుమార్ జైన్, పొట్లూరి వెంకట కృష్ణారావు, పిన్నమనేని వెంకట రామయ్య, కూటమి నేతలు బూరగడ్డ శ్రీకాంత్, లింగం ప్రసాద్, చేకూరు జగన్ మోహన్‌రావు, పంప్రాజు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



విజేతలు పూర్ణచంద్రరావు, నాగేంద్రలతో ఎమ్మెల్యే రాము, యలవర్తి తదితరులు

లభ్యం కాని అనూష ఆచూకీ

పెనమలూరు, న్యూస్‌టుడే : పెనమలూరు వంతెన పై నుంచి కాలువలోకి దూకిన మహిళను పోలీసులు గుర్తించారు. ఈమె పెనమలూరుకు చెందిన గొల్లపూడి అనూషగా తెలుసుకున్నారు. 15 రోజుల కిందట ఈమె తండ్రి మృతి చెందగా, అప్పటి నుంచి తీవ్ర మనోవ్యథతో ఉంటున్నారు. కుటుంబ సభ్యులు ఓదారుస్తున్నా ఆ బాధ నుంచి బయటకు రాలేకపోతున్నారు. తనకు బతకాలని లేదని, చనిపోవాలని ఉందంటూ తీవ్ర మానసిన ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం పెనమలూరు వంతెన పై నుంచి బందరు కాలువలోకి దూకారు. గల్లంతైన ఈమె ఆచూకీ కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కాలువలో విస్తృతంగా గాలిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అనూష (పాతచిత్రం)

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

నెక్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 228 చికెన్ స్కిన్‌లెస్ - 257.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

కాలువలో పడి వృద్ధుడి మృతి

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : ప్రమాదవశాత్తు కాలువలో పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని యాకమూరులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఉయ్యూరులో నివాసిస్తున్న జి.నాగ మోహనరావు శుక్రవారం రాత్రి స్థానిక గ్రామంలో మద్యం తాగి స్వగ్రామానికి వెళ్తున్నారు. వెళ్లే దారిలో కాలువ వద్ద మూత్రవిసర్జన చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయారు. ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. ఆదివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో కాలువలో మృతదేహం కనిపించింది. అల్లుడు ఫణీంద్రకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కిషోర్ తెలిపారు.



నాగమోహనరావు (పాత చిత్రం)

చికిత్స పొందుతూ ఖైదీ...

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఓ వ్యక్తి తీవ్ర అనారోగ్యంతో జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని కృత్తివెన్ను మండలం ఊర్లగొండిప్ప గ్రామానికి చెందిన జే.ఏసుబాబు(57) ఓ హత్య కేసులో నిందితుడిగా ఉండడంతో కోర్టు జీవిత ఖైదు విధించింది. 2019 అక్టోబరు ఏడో తేదీ నుంచి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నాడు. హృదయ సంబంధిత అనారోగ్య సమస్యతో బాధపడుతూ మందులు వినియోగిస్తున్నాడు. ఈనెల 25న ఆరోగ్యం క్షీణించడంతో జైలు అధికారులు జీజీహెచ్‌లో చేర్పించారు. 26వ తేదీ నుంచి వెంటిలేటర్‌పై ఉంచి వైద్యులు చికిత్స అందించారు. 29వ తేదీ రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు ఆదివారం కేసు నమోదు చేశామని మూడో పట్టణ పోలీసులు తెలిపారు.

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

? విద్యార్థుల వసతి గృహం శిథిలావస్థకు చేరింది. స్థానికులు వారి అవసరాలకు ఉపయోగిస్తున్నారు. భవనాన్ని ఏదైనా ప్రభుత్వ అవసరాలకు వినియోగించేలా చూడండి. - స్థానికులు

✔ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ అవసరాలకు ఉపయోగపడేలా చూస్తాం.

- పరహోతుల్లా, గ్రామ కార్యదర్శి, చెన్నూరు

శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యం



సమీక్షిస్తున్న డీఎస్పీ, పక్కన రూరల్ సీఐ

పెడన, న్యూస్‌టుడే: మచిలీపట్నం సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని డీఎస్పీ శ్రీనివాసరావు చెప్పారు. వార్షిక తనిఖీలో భాగంగా ఆదివారం పెడన పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. గతేడాదిగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, ఛార్జిషీట్ల దాఖలు తదితర వివరాలకు సంబంధించి రిజిస్టర్లను పరిశీలించారు. క్రైం రేటును ఆయన సమీక్షించారు. రిసెప్షన్ కౌంటర్‌కు వస్తున్న ఫిర్యాదులపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ఇటీవల ఒక మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదుదారుని పట్ల దురుసుగా ప్రవర్తించిన వైనంపై ఆరా తీశారు. ట్రాఫిక్ నియంత్రణ మరింత సమర్థంగా చేయాలని కీలక పాయింట్లలో సిబ్బందిని విధుల్లో నియమించాలని ఆదేశించారు. జాతీయ రహదారిపై ప్రమాదాల నియంత్రణకు చేపడుతున్న చర్యలపై సమీక్షించారు. రూరల్ సీఐ నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల అభ్యంతరాల నిశిత పరిశీలన

పెడన, న్యూస్‌టుడే: సర్‌లో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లకు సంబంధించి అభ్యంతరాలను నిశితంగా పరిశీలిస్తున్నామని పెడన రిటర్నింగ్ అధికారి ఎస్. పోతురాజు చెప్పారు. నియోజకవర్గంలోని 219 పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం జరిగిన ఓటర్ల నమోదు ప్రత్యేక డ్రైవ్‌ను ఆయన పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2002 ఓటర్ల జాబితాకు మ్యాపింగ్ కాని ఓటర్లతోపాటు అనామలీస్ కింద జాబితాలో అప్‌హోల్డ్‌లో ఉంచిన ఓటర్లు 8వేల పైచిలుకు ఉన్నారన్నారు. ఈ ప్రక్రియ సెప్టెంబరు 28 వరకు దశలవారీగా జరుగుతుందని అప్పటికీ సరైన ఆధారాలను అందజేయకుంటే అక్టోబరు 3న ప్రచురించనున్న తుదిజాబితాలో తొలగిస్తామని చెప్పారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఓటు హక్కు కోసం ఫారం-6లు 407, ఓటు హక్కు రద్దు ఫారం-7లు 19, మార్పులు చేర్పుల ఫారం-8 లు 682 అందినట్లు ఎన్నికల సెల్ డిప్యూటీ తహసీల్దార్ పీవీ నరసింహారావు చెప్పారు.

పెట్టుబడులకు బందరు అనువైన ప్రదేశం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే కాగిత, సినీనటులు నిధి అగర్వాల్, రాజా రవీంద్ర, సంస్థ డైరెక్టర్లు

గూడూరు, న్యూస్‌టుడే: పెట్టుబడులకు బందరు అనువైన ప్రదేశమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మండలంలోని తరకటూరు పరిధిలోని జాతీయ రహదారి పక్కన 16 ఎకరాల్లో కార్తికేయ ఇన్‌ఫ్రా అండ్ డెవలపర్స్ సంస్థ కోస్టల్ పార్క్ పేరిట ఏర్పాటు చేసిన వెంచర్‌ను ఆదివారం ప్రారంభించారు. మంత్రితోపాటు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదు సంస్థ బ్రాండ్ అంబాసిడర్ సినీ నటి నిధి అగర్వాల్, సినీ నటుడు రాజా రవీంద్ర, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు రంజిత్‌కుమార్ పొదిల, కిరణ్‌కుమార్ కొర్రపాటి తదితరులు వెంచర్ బ్రోచర్లు ఆవిష్కరించారు. వినియోగదారుల నమ్మకమే లక్ష్యంగా కోస్టల్ పార్కును తీర్చిదిద్దుతున్నట్లు సంస్థ డైరెక్టర్లు తెలిపారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి



నిరసనలో నాయకులు, ఉపాధ్యాయులు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఉపాధ్యాయుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డా. డి శ్రీను డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు సంబంధించి వివిధ డిమాండ్ల సాధనలో భాగంగా ఆదివారం నగరంలోని ధర్నాచౌక్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు జిల్లా అధ్యక్షుడు జీవీఎస్ పెరుమాళ్లు, ప్రధాన కార్యదర్శి నున్న రాంబాబు, మహిళావిభాగ రాష్ట్రనాయకురాలు బి. విజయలక్ష్మి తదితరులు ప్రసంగించారు. టెట్‌కు సంబంధించిన డిమాండ్‌లను ఇప్పటికే సంఘ పరంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని వాటిని పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. నాయకులు కె. గౌరి, డి. సత్యనారాయణ జిల్లాలోని వివిధ ప్రాంతాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాతల సేవలు ప్రశంసనీయం



శిలాఫలకం ఆవిష్కరణలో అతిథులు, కమిటీసభ్యులు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: దాతల సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. నగరంలోని బలరామునిపేట అన్నపూర్ణాసహిత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భోజనశాల షెడ్డును దాత దేవనబోయిన రామకృష్ణయాదవ్ ఆదివారం ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దోరడ్ల హేమప్రకాష్, కార్యదర్శి గుడివాడ మెహర్‌ప్రసాద్, ఉపాధ్యక్షుడు మోటమర్రి బాబాప్రసాదు తదితరులు దాతను సత్కరించారు. దుర్గాప్రసాద్, శ్యామసుందర్‌రావు, రమేష్, లక్ష్మీగణపతి, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ద్వారా సామాజిక సేవలు



విద్యార్థులతో అతిథులు, సంస్థ ప్రతినిధులు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: వాసవీక్లబ్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ జిల్లా గవర్నర్ మాజేటి హరిప్రసాద్ అన్నారు. ఆదివారం మచిలీపట్నం వాసవీ అనుబంధ క్లబ్‌ల ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఉచిత వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేయడంతోపాటు పేదలకు దుస్తులు, విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. వైస్ గవర్నర్ మోటమర్రి గోపాలకృష్ణ, జిల్లా క్యాబినెట్ కార్యదర్శి యండూరి సురేష్, కోశాధికారి మామిడి కేశవ వెంకటరామారావు, కందుల సురేష్, క్లబ్‌ల ప్రతినిధులు రేణుకారాణి, నాగవెంకటశిరీష, అశోక్, దివ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు



వ్యాసరచనలో చిన్నారులు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని హరేకృష్ణా ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని హరే రామ గురుకుల పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థి దశనుంచే సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ పల్లపాటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ముక్కు మూసుకొని వెళ్లాల్సిందే!



రామలక్ష్మణ వీవర్సు కాలనీకి వెళ్లే రహదారి చెత్తాచెదారంతో నిండిపోయి అధ్వానంగా మారింది. మినీ డంపింగ్ యార్డులా మారింది. దీంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దుర్వాసన వెదజల్లుతోంది. అటు వైపు ప్రయాణం చేయాలంటే కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. పుర పాలక పారిశుద్ధ్య సిబ్బంది పట్టించుకోకపోవటంతో అన్ని రకాల వ్యర్థాలు ఇక్కడ వేస్తున్నారు. చెత్తా చెదారం తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పెడన గ్రామీణం

హోమాలు.. పూజలు



మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: నగరంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని సూర్యభగవానుడికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించగా వేదపండితులు పూజా క్రతువులు జరిపించారు. విఘ్నేశ్వరుని ఆలయంలో గణపతి హోమం జరిపించగా భక్తులు దర్శించుకున్నారు. పూజల్లో పాల్గొన్నవారికి ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సారథి.. వంతెనల తీరిది..!

సగంలో నిలిచిన వారధుల నిర్మాణం

మచిలీపట్నం(గొడుగుపేట), గూడూరు, న్యూస్‌టుడే

తెదేపా హయాంలో అప్పటి ఎమ్మెల్యే కాగిత వెంకట్రావు హయాంలో వంతెన పనులు ప్రారంభించారు. అనంతరం వైకాపా ప్రభుత్వం రావడంతో ఐదేళ్లు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి రెండేళ్లు దాటింది. సమీక్షలు, ప్రతిపాదనలు తప్ప ఎలాంటి కదలికా లేదు.. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదుకు చెప్పాం... ఎంపీ వల్లభనేని బాలశౌరి వద్ద మొర పెట్టుకున్నాం.. ఇలాగే వదిలేస్తారా.. పూర్తిచేస్తారా..? ఇదీ గూడూరు మండలంలోని జొన్నలరేవు వంతెనల పనులపై ప్రజల ఆవేదన.



మరో చోట పైకప్పు దశలో నిలిచి..

అసంపూర్తి పనులతో..: గూడూరు మండలంలోని రాయవరం, కంచాకోడూరు, మద్దిపట్లతోపాటు మొవ్వ మండలంలోని కోళ్లపాలెం, కాజ, పద్దారాయుడుతోట తదితర గ్రామాల ప్రజలు రాయవరం నుంచి గూడూరు రావాలంటే ఆరు కిలోమీటర్లకుపైగా చుట్టూ తిరిగి రావాలి. అదే జొన్నలరేవుపై వంతెనలు నిర్మిస్తే కిలోమీటరు మాత్రమే ఉంటుంది. దశాబ్దాలుగా ఈ వంతెన నిర్మించాలని ప్రజలు పాలకులకు అర్జీలు ఇస్తూనే ఉన్నారు. తెదేపా హయాంలో రూ. 7.40 కోట్లకుపైగా నిధులతో రెండు చోట్ల వంతెనలు నిర్మించడానికి చర్యలు తీసుకోవడంతో అంతా సంతోషించారు. పనులు సాగుతున్న తరుణంలో వైకాపా ప్రభుత్వం రావడంతో ఎక్కడి పనులు అక్కడ ఆగిపోయాయి. ఒక వంతెన స్లాబు దశలో మరో వంతెన పునాదుల దశలో ఆగిపోయింది. వంతెనలు నిర్మిస్తున్నారని, గూడూరు నుంచి వంతెనల వరకు రహదారి కూడా నిర్మించారు. ప్రస్తుతం ఆ రోడ్డు నిర్మించినా ఉపయోగం లేకుండా తయారైంది.



ఒక చోట పునాదులదశలో ఆగి..

ప్రతిపాదనలు సరే.. నిధులేవి..: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదు ఆదేశాలతో మిగిలిన పనులు పూర్తి చేయడం, అప్రోచ్ కోసం వదిలేసిన రహదారి నిర్మాణానికి కలిపి ప్రతిపాదనలు పంపించారు. కానీ నిధుల విడుదలలో జాప్యం కావడం, సామగ్రి ధరలు పెరగడంతో ఇటీవల మళ్లీ ప్రతిపాదనలు చేయాలని ఆదేశించడంతో అధికారులు రూ. 8 కోట్ల వరకు అవసరం అవుతాయని ప్రభుత్వానికి మళ్లీ నివేదించారు. ఇలా పనులు ఆలస్యం అవుతున్న కొద్దీ వ్యయం కూడా పెరిగిపోతుంది. ఎంపీ బాలశౌరి ఆదేశాలతో రెండు నెలల కిందట రూ. 8.10కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. ఇలా ఎప్పటికప్పుడు ప్రతిపాదనలు చేయడం తప్ప నిధులు విడుదల కావడంలేదు.

సామాజిక సంబంధాలతో మానసిక ప్రశాంతత



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభురాం

మచిలీపట్నం(కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: సామాజిక సంబంధాలను మెరుగుపర్చుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత దక్కుతుందని మానసిక వైద్య నిపుణులు ప్రభురాం పేర్కొన్నారు. ఉదయపు నడక మిత్రమండలి, మహిళా విభాగాల ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని వృద్ధుల్లో వచ్చే మానసిక సమస్యలు, పరిష్కారాల గురించి వివరించారు. కుటుంబ సభ్యులతో రెండు నెలలకు ఒకసారైనా కలిసిమెలిసి ఆత్మీయంగా ఉండాలన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బృందావనం శ్రీనివాసాచార్య మాట్లాడుతూ.. ప్రతి రోజూ కొంత దూరం నడవాలని.. తేలికైన యోగాసనాలు, ప్రాణాయామం చేయాలని సూచించారు. అసోసియేషన్ మచిలీపట్నం అధ్యక్షుడు శివప్రసాద్, నడక మిత్రమండలి మురళినాథ్, సభ్యులు తాండవకృష్ణ, మహిళా విభాగ అధ్యక్షురాలు లంకిశెట్టి నీరజ, సీహెచ్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

త్వరలో 'ప్రత్యేక' పిల్లల గుర్తింపు ప్రక్రియ

న్యూస్‌టుడే, పెడన గ్రామీణం: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థుల శారీరక, మానసిక వైకల్య అంశాలపై ప్రాథమిక గుర్తింపు ప్రక్రియ చేపట్టనున్నారు. ఇప్పటికే ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న అన్ని కేటగిరీల ఉపాధ్యాయుల్ని ప్రశస్త్ యాప్‌లో గంట నిడివి గల 10 ట్యుటోరియల్ వీడియోల్ని చూడాలని సమగ్ర శిక్షా(ఎస్ఎస్) ఆదేశాలు జారీ చేసింది. ఆగస్టు నెలాఖరు లోపు వీడియోల్ని చూసి విద్యార్థుల్ని ప్రాథమికంగా స్క్రీనింగ్ చేయాలని సూచించారు. ప్రతి రోజూ ఉపాధ్యాయులు ఏ మేరకు చూస్తున్నారు అన్న అంశాన్ని సాంకేతికంగా మానిటర్ చేస్తున్నారు. ఇప్పటికి జిల్లాలో 80 శాతం మంది ఉపాధ్యాయులు మాత్రమే ఈ వీడియోలు చూసినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇంకా 20 శాతం మంది ఉపాధ్యాయులు వీడియోల్ని చూడాల్సి ఉంది. దీంతో విద్యార్థులకు జరగాల్సిన మొదటి దశ స్క్రీనింగ్ వాయిదా వేశారు. మొదటి దశలో ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఉన్న వైకల్యాల్ని గుర్తించి ప్రత్యేక అవసరాల గల ఉపాధ్యాయులకు రిఫర్ చేయాల్సి ఉంటుంది. వారు రెండో దశ స్క్రీనింగ్ చేసి సంబంధిత విద్యార్థులు ఇంటలెక్చువల్ డిసేబుల్డా.. వినికిడి, కంటి చూపునకు సంబంధించిన సమస్యలున్నాయా అన్న విషయాన్ని గుర్తిస్తారు. వీరికి ఏ రకమైన థెరపీలు అవసరం, సమగ్ర శిక్షా ఏర్పాటు చేసే శిబిరాలకు తీసుకుని వెళ్లాలా? అన్న విషయం గుర్తిస్తారు. జిల్లాలో 50 భవిత కేంద్రాల్లో 45 మంది సమగ్ర విద్యా వనరుల ఉపాధ్యాయులు (ఐఈఆర్పీ) పని చేస్తున్నారు. వీరితో పాటు 30 జడ్పీ పాఠశాలల్లో 30 మంది సమగ్ర విద్యా వనరుల స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. రెండో దశలో వీరు విద్యార్థుల్ని గుర్తించే ప్రక్రియ చేపట్టనున్నారు. జిల్లాలో 3,200 మంది ప్రత్యేక అవసరాల గల పిల్లలు భవిత కేంద్రాల్లో, పాఠశాలల్లో శిక్షణ పొందుతున్నారు.

తప్పనిసరిగా చేయాలి: కె. ఏడుకొండలు, జిల్లా సహిత విద్య సమన్వయకర్త, కృష్ణా ఉపాధ్యాయులు అందరూ యాప్‌ను చూడాలి. స్క్రీనింగ్ తప్పనిసరిగా చేయాలి. తాము పని చేస్తున్న పాఠశాలలో విద్యార్థులందరినీ చూసి యాప్‌లో నమోదు చేయాలి.

ఈ నీరు తాగగలమా!



బంటుమిల్లిలో తాగు నీటి కోసం ప్రజలు తల్లడిల్లుతున్నారు. పూర్వ కాలం సాంకేతిక పద్ధతులు లేని రోజుల్లోనే స్వచ్ఛమైన తాగు నీరు దొరికేది. అధునాతన టెక్నాలజీ వచ్చాక రక్షిత మంచి నీటి పథకాల ద్వారా స్వచ్ఛమైన తాగు నీరు అందని పరిస్థితి. కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగు నీరు రంగు మారి, మట్టిమయంగా ఉంటోంది. ఈ నీరు తాగడానికి, వాడుకోవడానికి కూడా పనికి రావడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి నోచుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. - న్యూస్‌టుడే, బంటుమిల్లి

ధర వరలు



టమాట 25, వంగ 24, బెండ 14, పచ్చిమిర్చి 26, కాకర 26, క్యాబేజీ 24, క్యారెట్ 40, దొండ 24 బంగాళదుంప 24, ఉల్లిపాయలు 48 గోరుచిక్కుడు 20 దోస 16, సొర 10,08 అరటికాయ 7,8, చిక్కుళ్లు 34 బీర 24, చామదుంప 34, మునగ 06/05, కంద 34, బీట్‌రూట్ 40, కీరదోస 45, బీన్స్ 90, క్యాప్సికం 50, అలసందలు 30, చిలకడదుంప 46, కొత్తిమీర 22,11, పుదీనా 15/05 సోమవారం ఉదయం 7 గంటల వరకు ఈ ధరలు వర్తిస్తాయి. ఫిర్యాదులుంటే ఎస్టేట్ అధికారి బలిచక్రవర్తి, ఫోన్ 9182361295లో ఏవైనా సమస్యలు ఉంటే సంప్రదించవచ్చు.

సినిమాలు

రేవతీ: విశ్వనాథ్ అండ్‌సన్స్
సిరికృష్ణ: టాక్సిక్
సిరివెంకట్: ఇరుముడి

- మచిలీపట్నం(గొడుగుపేట),న్యూస్‌టుడే

భారీ అన్న సమారాధన

పెడన, న్యూస్‌టుడే: పెడన మండలం నేలకొండపల్లిలో ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. దాదాపు పది వేల మందికి పైగా పాల్గొన్నారు. ఈ నెల 26న గ్రామంలో రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహాన్ని నూతన ఆలయంలో ప్రతిష్ఠించిన సందర్భంగా మూడో రోజున ఈ కార్యక్రమం నిర్వహించారు.

బహుమతుల అందజేత

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: జిల్లా గ్రంథాలయంలో విద్యార్థులకు ప్రతి ఆదివారం వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నందున, అందరూ వినియోగించుకోవాలని గ్రంథాలయ ఉప అధికారి బీరం వెంకటరమణ అన్నారు. ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, డాన్స్, చెస్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించగా నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభచాటిన వారికి బహుమతులు అందజేశారు. కేవీవీఎన్ బసవేశ్వరరావు, డి. వాసవి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: ఎన్ఆర్ఐ పేషెంట్స్ అసోసియేషన్ మచిలీపట్నం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని బాలాజీ నర్సింగ్‌హోంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న వారికి అసోసియేషన్ అధ్యక్షుడు డా. బి శ్రీనివాసాచార్య మధుమేహ వ్యాధికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధుమేహ వ్యాధికి అందరూ చికిత్స తీసుకుంటూ జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యదర్శి పి. మోహనరావు, డా. శివప్రసాద్, ఎం. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ జాతర

పెడన, న్యూస్‌టుడే: పెడన మండలం చేవేంద్రపాలెంలో ఆదివారం గ్రామదేవత గంగానమ్మకు నైవేద్యాలు సమర్పించారు. గ్రామస్థులు సామూహికంగా మేళతాళాలతో అమ్మవారి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు జరిపారు. వర్షాలు కురిసి పంటలు పండాలని వేడుకున్నారు.

ప్రజాదర్బార్ నేడు

మచిలీపట్నం(కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: తెదేపా నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ప్రజాదర్బార్‌లో మంత్రి కొల్లు రవీంద్ర నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కార చర్యలు తీసుకుంటారన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరాం

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

తెదేపాకు కార్యకర్తలే బలం

పెనమలూరు, న్యూస్‌టుడే : తెదేపాలో కార్యకర్తల సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యం ఉంటుందని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తెలిపారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన పార్టీ క్రియాశీలక కార్యకర్తలు కొల్లి సురేష్‌బాబు, పత్రి వరహాలరావు, కొడాలి రాజేంద్రలు ఇటీవల అకాల మరణానికి గురయ్యారు. ఈ మేరకు కార్యకర్తల సంక్షేమ బీమా నుంచి ఒక్కొక్క మృతుని కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున రూ.15 లక్షలు మంజూరయ్యాయి. ఆయా మొత్తాలకు చెందిన చెక్కులను మృతుల కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్, కొండ ప్రవీణ్, వల్లే నరసింహారావు, పీతా గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కాలర్ : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందన: గన్నవరం చింతలపేట శివారులో వ్యర్థాలు పేరుకుపోయాయి. నివాసితుల సమస్యను ఈనాడు చెన్నకేశవులు దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సిబ్బందితో వ్యర్థాలు తొలగించారు.
✔ గన్నవరం రాయనగర్ పరిసరాల్లోని డ్రెయిన్లలో పూడికలు ఏర్పడ్డాయి. ఈనాడు చెన్నకేశవులు దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందిని పంపి మురుగు తొలగించారు. **-న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం**

కంప్యూటర్, ప్రింటర్ అందజేత

గంగూరు(పెనమలూరు), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చిన దావీర్ కార్యక్రమానికి గంగూరు మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎండీ అక్బర్ పాషా రూ.80 వేల విలువైన కంప్యూటర్, ప్రింటరును పంచాయతీకి విరాళంగా అందజేశారు. దాతను గ్రామ కార్యదర్శి ప్రకాష్ నాథ్, అధికారులు అభినందించారు.

రెల్లి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి


సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న నాగేంద్రబాబు

పెనమలూరు, న్యూస్‌టుడే : ఎస్సీ(ప) సామాజిక వర్గానికి చెందిన రెల్లి కులాలకు ప్రత్యేకంగా రెల్లి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర రెల్లి యువజన సంఘం అధ్యక్షుడు బంగారు నాగేంద్రబాబు, ముఖ్యమంత్రి చంద్రబాబును రాజధాని అమరావతిలో కలిసి కోరారు. ఈ మేరకు నాగేంద్రబాబు వినతిపత్రం అందజేశారు. కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ద్వారా రెల్లి కులాల వారికి రాజకీయ ప్రాధాన్యం పెరుగుతుందని చెప్పారు.

'టిడ్కో' గృహాలను పాడుపెట్టిన వైకాపా ప్రభుత్వం


ప్రసంగిస్తున్న పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్


సభకు హాజరైన లబ్ధిదారులు

ఉయ్యూరు, న్యూస్‌టుడే : వైకాపా పాలనలో పాడుపెట్టిన టిడ్కో గృహాల్లో కూటమి ప్రభుత్వం పూర్తి చేసే పనులను లబ్ధిదారులు స్వయంగా చూసుకునేందుకే టిడ్కో గృహ సందర్శన యాత్ర ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే వై.వి.బి.రాజేంద్రప్రసాద్ అన్నారు. ఉయ్యూరులోని టిడ్కో గృహ సముదాయంలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించేందుకు లబ్ధిదారులకు గృహాల సందర్శన యాత్ర కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడే మాట్లాడుతూ లబ్ధిదారుల పేరుపై బ్యాంకు రుణాలు తీసుకొని, పైసా పని చేయకుండా వైకాపా ప్రభుత్వం మోసం చేసిందని, గృహాలను మరుగున పడేసి పాడుపెట్టిందని ఆరోపించారు. తెదేపా హయాంలో చేసిన పనులను సైతం పాడైపోవడంతో మళ్లీ కూటమి సర్కారుపై భారం పడిందన్నారు. మాజీ ఎమ్మెల్యే వైవీబీ మాట్లాడుతూ ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు ఒక్కటే చెప్పారు. కూడు, గూడు, గుడ్డ ప్రతి పేదవాడికి అందిస్తామని తెలిపారు. అదే ఆశయంతో చంద్రబాబు సైతం ఆ బాటలోనే నడుస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమానికి తెదేపా పట్టణ అధ్యక్షుడు గుర్నాధరావు అధ్యక్షత వహించారు. పురపాలిక మాజీ ఛైర్మన్లు పూర్ణచంద్రరావు, వల్లభనేని సత్యనారాయణ, షాదీఖానా ఛైర్మన్ అబ్దుల్ ఖుద్దూస్, ఏఎంసీ ఛైర్మన్ కాండా ప్రవీణ్, అనుమోలు ప్రభాకరరావు, పురపాలక సంఘం కమిషనర్ సుభాశ్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానం.. మురికి కూపం

కంకిపాడు, న్యూస్‌టుడే

కంకిపాడు నుంచి కోలవెన్ను వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర విస్తరించిన నంబిగుంట(పంట) కాలువ మురికి కూపంగా తయారైంది. ఈ కాలువ కట్టపై కొందరు కిలోమీటరు పొడవునా నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. వీటి నుంచి బయటకు వచ్చే చెత్తాచెదారం, మలమూత్రాలను నేరుగా నీటిలోకి వదులుతున్నారు. లాకుల రోడ్డులో మాంసం, చేపల దుకాణాల వాలూకు వ్యర్థాలను కుమ్మరిస్తున్నారు. ఈ నేపథ్యంలో నీరు పారుదల అధికంగా ఉన్నప్పుడు మినహా అన్ని సమయాల్లోనూ దుర్వాసన వ్యాపిస్తూనే ఉంటోంది. మూడు రోజులుగా కంకిపాడులో నమోదు అవుతోన్న డయేరియా కేసుల్లో మూడువంతుల బాధితులు ఈ కాలువ కట్టపై ఉండే నివాసులే కావడం ప్రస్తావనీయం.


నంబిగుంట కాలువలో పడేసిన వ్యర్థాలు

ఆక్రమణలతో...: కంకిపాడు లాకుల రహదారి, బందరు రోడ్డు పక్కన ఉన్న గంగానమ్మ గుడి నుంచి ప్రధాన డ్రెయిన్ ద్వారా మురుగంతా నంబిగుంట కాలువలోనే కలుపుతున్నారు. ప్రధానంగా బస్టాండ్‌లోని మరుగుదొడ్ల వ్యర్థాలూ కలుస్తున్నాయి. ఆక్రమణల కారణంగా పూడికతీత పనులకు జేసీబీని వాడే అవకాశం లేకుండా పోయింది. ఇక చేసేది లేక యంత్రానికి అందినంత వరకు శుభ్రం చేసి మిగతా భాగాన్ని వదిలేస్తున్నారు.

చొరవ చూపకపోవడంతో...: ఈ కాలువ కట్టపై దాదాపు 600 మంది ఓటర్లు ఉన్నారు. దీంతో ఆక్రమణల తొలగింపునకు ఏ పార్టీ వారు చొరవ తీసుకోవడం లేదు. ఇక్కడ సెంటు స్థలం రూ.2 లక్షల వరకు పలుకుతోంది. 50 శాతం మంది నివాసితులు స్థలాలను కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు అధికంగా ఉన్నారు. వీరిలో చాలా మందికి జగనన్న కాలనీలో స్థలాలను నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న గొడవర్రులో కేటాయించినా వివిధ కారణాలతో గృహాలు నిర్మించుకోలేదు. సమస్య శాశ్వత పరిష్కారానికి స్థలాలు మంజూరైన వారిని అక్కడకు పంపడం, లేని వారికి ప్రత్యామ్నాయం చూపి ఆక్రమణలను తొలగించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

భక్తులకు అన్నదానం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడు ధర్మకోట వెలుగుల్లో గంగానమ్మ ఆలయ మూడో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం అన్నదానం నిర్వహించారు. తొలుత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం గుడి కమిటీ సభ్యుల పర్యవేక్షణలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

వైభవంగా నాగసాయిబాబా ఆలయ వార్షికోత్సవం

నున్న(పి.నైనవరం), న్యూస్‌టుడే: విజయవాడ గ్రామీణ మండలం పి.నైనవరం- అంబాపురం గ్రామాల మధ్య ఉన్న నాగసాయిబాబా ధ్యాన మందిరంలో నాలుగో వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. అభిషేకం, పుష్పాలంకరణ, హోమం కార్యక్రమాలు చేశారు. ముత్యాల సాంబశివశర్మ, శివరామకృష్ణ ప్రసాద్ శర్మల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

యువతకు మెండుగా ఉపాధి అవకాశాలు

కాటూరు(ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్కారు కొలువులతో పాటు వివిధ బహుళజాతి సంస్థలు రావడంతో ఎంతో మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి అన్నారు. ఇంటింటికీ తెలుగుదేశం ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆయన ఆదివారం కాటూరులో పర్యటించారు. ప్రజలకు సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు సజ్జా మధు, అనూష, చీకుర్తి యుగబాబు, దేవరపల్లి ఫిలిప్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ప్రదర్శిస్తున్న దండమూడి చౌదరి, స్థానికులు

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం

యనమలకుదురు, న్యూస్‌టుడే : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని పెనమలూరు నియోజకవర్గ తెదేపా యువ నాయకుడు బోడే వెంకట్రామ్ అన్నారు. ఆదివారం యనమలకుదురులో ఛేజ్ స్కేటింగ్ అండ్ ఫిట్‌నెస్ నేతృత్వంలో జరిగిన రాష్ట్ర స్థాయి చేస్ రోలర్స్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్- 2026 విజేతలకు ఆయన బహుమతులు అందించారు. మన ప్రాంత క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి పెనమలూరు నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో టోర్నమెంటు నిర్వాహకులు, తల్లిదండ్రులు, శిక్షకులు పాల్గొన్నారు.


విజేతలతో బోడే వెంకట్రామ్, నిర్వాహకులు

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: క్రమశిక్షణతో కూడిన విద్య నేటి సమాజానికి అవసరమని, ఆ దిశగా విద్యార్థులు అడుగులు వేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. గన్నవరం మండలం వీరపనేనిగూడెంలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో విద్యార్థులకు మానవ, రాజ్యాంగ హక్కులు, విద్య ఆవశ్యకతపై ఆదివారం అవగాహన కల్పించారు. మానవ హక్కుల కమిషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జీఎస్టీ కార్యాలయ ఉద్యోగిని సీహెచ్.సువర్ణ, పి.అశోక్‌కుమార్, ప్రిన్సిపల్ గిరికుమారి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, అధికారులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సువర్ణ

పెద ఆవుటపల్లిలో నవదిన ప్రార్థనలు ప్రారంభం

ఉంగుటూరు, న్యూస్‌టుడే : మండలంలోని పెదఆవుటపల్లి బ్రదర్ జోసెఫ్ తంబి పుణ్యక్షేత్రంలో సెప్టెంబరు 7, 8 తేదీల్లో నిర్వహించే ఫాతిమామాత మహోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం నుంచి నవదిన ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రార్థనలో గన్నవరం విచారణ గురువులు ఫాదర్ పసుల తోమాసు పాల్గొన్నారు. దేవుడి ఆజ్ఞను పాటిస్తూ వినయ విధేయలతో జీవించిన మరియు ధన్యజీవి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ జ్యాన్నేస్ నీలూరి, విచారణ గురువులు ఫాదర్ చిన్నప్ప పయార్థ, గురువులు, సంఘ పెద్దలు, యువత పాల్గొన్నారు.


దివ్య పూజాబలి సమర్పిస్తున్న మత గురువులు

నియోజకవర్గంలో అర్హులందరికీ ఓటు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో అర్హులందరికీ ఓటు హక్కు ఉండాలని, ఈ మేరకు బీఎల్వోలు పక్కాగా చర్యలు తీసుకోవాలని నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ వైస్‌ఛైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం రంగన్నగూడెంలో ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక కార్యాచరణను ఆయన పర్యవేక్షించారు. 'సర్' కార్యక్రమంలో భాగంగా పేర్లు, చిరునామాల్లో చోటుచేసుకున్న చిన్నపాటి తప్పుల వల్ల వందల మంది ఓటర్ల దరఖాస్తులు పునఃపరిశీలనకు వచ్చాయని, ఓటర్లు తగిన ధ్రువపత్రాలు సమర్పిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. బీఎల్వోలు చొరవ తీసుకుని ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. నాయకులు కనకవల్లి శేషగిరిరావు, కసుకుర్తి వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక కార్యాచరణ పరిశీలించిన ఆళ్ల గోపాలకృష్ణ

నిర్వహణ నీరుగార్చేస్తున్నారు



మంచినీటి ట్యాంకుల నిర్వహణపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా కొందరి అధికారుల తీరులో మార్పు రావడంలేదు. పదిహేను రోజులకోసారి ట్యాంకులను శుభ్రం చేయడం, పరిసరాలు శుభ్రంగా ఉంచడం వంటి విషయాల్లో కార్యాచరణ లోపించింది. బాపులపాడు మండలంలో పలు ట్యాంకుల పరిస్థితి ఇదే. పెరికీడులో వసంతవాడ వెళ్లే రహదారి వెంబడి ట్యాంకు చుట్టూ దట్టంగా గడ్డి, పొదలు పెరిగిపోయాయి. ట్యాంకుని శుభ్రం చేసిన తేదీ, తదుపరి శుభ్రం చేయబోయే తేదీలు నమోదు చేయాల్సిన సూచిక ఖాళీగా కనిపిస్తోంది. **-న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్**

అధ్వానం.. అపరిశుభ్రం



గన్నవరం మండలం కేసరపల్లి ఐటీ పార్క్ పరిసరాలు అధ్వానంగా మారాయి. మేధా టవర్స్, ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల మధ్య ఉన్న రోడ్డులో వ్యర్థాలను గుట్టలుగా పోశారు. మధ్యాహ్న సమయంలో వాటికి నిప్పు పెడుతున్నారు. దీంతో ఐటీ పార్క్‌లో పొగ, దుర్వాసన వస్తోందని ఉద్యోగులు వాపోతున్నారు. ఐటీ పార్క్ ప్రధాన రహదారిని ఆనుకొని నిర్మిస్తున్న కస్టమ్స్ కార్యాలయం సమీపంలోనూ ఇదే దుస్థితి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం**

మంతెనలో మురుగు బెడద



మంతెనలో మురుగు బెడద అధికంగా ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. ప్రధాన రహదారికి రెండువైపులా పదేళ్ల కిందట నిర్మించిన డ్రెయిన్ల నిర్మాణం మధ్యలోనే ఆపివేయడంతో ఈ సమస్య వస్తుందని స్థానికులు చెబుతున్నారు. పై నుంచి వచ్చే నీరు బయటకు పోయే మార్గం లేక నివాస స్థలాల్లోకి చేరుతోందని గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా స్పందన కరవైంది. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, మంతెన (కంకిపాడు)

శునకాలతో జాగ్రత్త



గన్నవరం నియోజకవర్గంలో వీధి శునకాల బెడద తీవ్రమైంది. ప్రధాన రహదారులపై గుంపులుగా తిరుగుతున్న వీటిని చూసి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కుక్క కరిస్తే యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌కు ఆశ్రయించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంతోపాటు, ప్రభుత్వ కార్యాలయాల్లోకి గ్రామ సింహాలు పాగా వేస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి, శునకాలను పట్టుకుని దూర ప్రాంతాలకు తరలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.
- న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

గుంతల పూడ్చివేత



కానూరు మహదేవపురం కాలనీ శివాలయం రోడ్డు ఎదురుగా ఉన్న రాధాకృష్ణ రెసిడెన్సీకి వెళ్లే రోడ్డు గోతులమయంగా ఉందని స్థానికులు ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాంతానికి విచ్చేసిన దుర్గగుడి పాలక మండలి సభ్యుడు వెలగపూడి శంకరబాబు దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని ఆయన ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌కు తెలియజేయడంతో సమస్య పరిష్కరించాలని పురపాలిక అధికారులను ఆదేశించారు. దీంతో వారు రహదారికి మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించారు. **- న్యూస్‌టుడే, కానూరు**

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హనుమాన్‌జంక్షన్ ఎస్సై ఎం.శ్రీనివాస్ హెచ్చరించారు. ఎస్పీ విద్యాసాగర్ ఆదేశాల ప్రకారం ఆదివారం పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాల్లో భాగస్వాములైతే చట్ట ప్రకారం చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.


కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై శ్రీనివాస్

అతిసారాన్ని అరికట్టేలా చర్యలు తీసుకోండి

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలో ప్రబలుతున్న అతిసార వ్యాధి నివారణకు ఆయా పంచాయతీ అధికారులు, వైద్యారోగ్య శాఖ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం. హరిబాబు అన్నారు. ఆదివారం కంకిపాడు సీహెచ్‌సీని సందర్శించిన ఆయన బాధితులతో మాట్లాడారు. ఏ పదార్థాలు తిన్నారు, ఏ నీరు తాగారనే అంశాలపై ఆరాతీశారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు ప్రతి వారం ట్యాంకులు శుభ్రం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చిక్కవరపు శ్రీహరి, నాయకులు వి.శివశంకర్, జి.రవికుమార్, సాయి, నిశాంత్, ఆకాష్, రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


బాధితులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు హరిబాబు

వీరు వద్దంటారు.. వారు తప్పదంటారు



కంకిపాడు బస్టాండ్‌లో సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. వివిధ గ్రామాలకు వెళ్లే విద్యార్థులు ఈ సమయంలోనే అధిక సంఖ్యలో బస్‌స్టేషన్‌కు చేరుతున్నారు. అప్పటికే నిండి ఉన్న బస్సుల్లోకి తోసుకెళ్తున్నారు. సిబ్బంది వారిస్తున్నా గమ్యం చేరాలని ఫుట్‌బోర్డుపైనే ప్రయాణిస్తున్నారు. విద్యార్థుల బస్ పాస్‌లను అనుమతించే అవనిగడ్డ, మచిలీపట్నం, నాగాయలంక ప్రాంతాలకు వెళ్లే పల్లె వెలుగు సర్వీసులకు ఈ సమస్య ఎదురవుతోంది. బస్సులు మలుపులు తిరిగే సమయంలో పక్కనే ఉన్న విద్యుత్తు స్తంభాలు, ఇతర వాహనాలకు ఫుట్‌బోర్డులపై వేలాడేవారు ఢీకొనే ప్రమాదం పొంచి ఉంది. - **కంకిపాడు, న్యూస్‌టుడే**

అప్రమత్తమైన అధికారులు

గోసాల(పెనమలూరు), న్యూస్‌టుడే : కంకిపాడులో ప్రభావం చూపుతున్న అతిసారంతో సరిహద్దులోని గోసాల పంచాయతీ అధికారులు అప్రమత్తమవుతున్నారు. కంకిపాడులో కలిసి పోయినట్లు ఉండే నెహ్రూనగర్, ఇస్లాంపేట, ఈదులడొంక, వేణుగోపాల స్వామి నగర్, వైకుంఠపురం, ఎస్సీ కాలనీల్లో చెత్త, వ్యర్థాలను తొలగించడంతో పాటు రహదారులు, పల్లపు ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించారు. గ్రామ పరిధిలోని తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించినట్లు గ్రామ కార్యదర్శి కూర్మారావు తెలిపారు. అవసరమైతే ముందస్తుగా వైద్య బృందాలను కూడా ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.


వీధుల్లో బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

తాగునీరు వృథా



కానూరు కామయ్యతోపు సెంటర్ గంగానమ్మ గుడి ఎదురుగా రెండు రోజులుగా పైపు లీకు కావడంతో నీరు వృథాగా పోతుంది. ఈ నీరు, పక్కనే ఉన్న మురుగుతో కలవడంతో స్థానికుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా పురపాలిక అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కానూరు**

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం పట్టణంలో చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక చార్మినార్ టీ దుకాణం వద్ద రోడ్డు దాటుతున్న మహిళను అతివేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో మహిళ తలకు తీవ్ర గాయమైంది. వెంటనే సమాచారం అందుకున్న అంబులెన్స్ బృందం క్షతగాత్రురాలిని తొలుత గన్నవరంలోని ఆసుపత్రికి, అనంతరం విజయవాడ జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

గుడివాడ

• గుడివాడ • పామర్రు • అవనిగడ్డ



మొక్కలు నాటుతున్న సభ్యులు, తదితరులు

రహదారి వెంబడి పచ్చదనానికి కృషి

అవనిగడ్డ, న్యూస్‌టుడే: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అవనిగడ్డ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం 'మొక్కలు నాటుదాం' కార్యక్రమం లంకమ్మ మాన్యం రహదారి వెంబడి నిర్వహించారు. ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ ఆకుల హరిప్రసాద్ మొక్కలు నాటారు. డాక్టర్ చేబ్రోలు హరిబాబు, ఎన్వీ నాగేశ్వరరావు, జి.హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఘంటసాలలో కరపత్రాలను ప్రదర్శిస్తున్న తెదేపా నేతలు

ఇంటింటికీ కరపత్రాల పంపిణీ

ఘంటసాల, న్యూస్‌టుడే: ఘంటసాలలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమంపై తెదేపా ఆధ్వర్యంలో ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఘంటసాల క్లస్టర్ సమన్వయకర్తలు ముప్పనేని రవిప్రసాద్, పాటిబండ్ల నరేష్, గుత్తికొండ ప్రసాద్ పాల్గొన్నారు.

తెదేపాకు జానకిరామయ్య కృషి ఎనలేనిది

కూచిపూడి, న్యూస్‌టుడే: కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్‌గా 27 సంవత్సరాల పాటు పని చేసిన కురియన్ అవార్డు గ్రహీత మండవ జానకిరామయ్య విగ్రహం శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. మొవ్వ సెంటరులో మండవ జానకిరామయ్య విగ్రహ శంకుస్థాపన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మొవ్వను చదువుల వాడగా మార్చారని కొనియాడారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, నాయకులు తాతినేని పూర్ణచంద్రరావు, మండవ వెంకట్రావు, కోటేశ్వరరావు, రత్నగిరిరావు, వెంకటేశ్వరరావు, బాబూరావు, నారాయణరావు, శ్రీనివాసరావు, పద్మ పాల్గొన్నారు.



జానకిరామయ్య విగ్రహానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, నాయకులు

నేడు డయల్ యువర్ కమిషనర్

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ పురపాలక సంఘంలోని పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిదీపాలు తదితర సమస్యలపై ఈనెల 31వ తేదీన ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ ప్రత్యేక 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ సింహాద్రి మనోహర్ తెలిపారు. పట్టణ ప్రజలు వారి సమస్యలను 8712624774 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. వాటిని పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

చిన్న వయసు నుంచే సేవా గుణం నేర్పాలి

గుడివాడ, న్యూస్‌టుడే: సమాజంలోని చిన్నారులకు చిన్న వయసు నుంచే పరోపకారం, సేవా లక్షణాలను నేర్పించాలని వాసవీ ఇంటర్నేషనల్ పరివార్ జిల్లా అధ్యక్షుడు కూరాళ్ల శ్యామ్ సుందర్ పేర్కొన్నారు. స్థానిక ధనియాలపేట ప్రణవాశ్రమంలోని బాలచాత్రాలయ విద్యార్థులకు చిరువోలు లంక మున్నా, లావణ్యల కుమార్తె వైష్ణవి జన్మదినం సందర్భంగా ఆదివారం నిత్యావసరాల్ని పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సొంత లాభం కొంత మానుకుని సమాజంలోని దీనులకు సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో కూరాళ్ల సాయిబాబు, మూడెడ్ల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న వైష్ణవి

విలీన గ్రామాలతో కలిపే పురపాలక ఎన్నికలు!

కేసు వెనక్కి తీసుకున్న ఫిర్యాదిదారు

గుడివాడ, న్యూస్‌టుడే

గుడివాడ పురపాలక సంఘ ఎన్నికలు ఏడేళ్ల తర్వాత 6 విలీన గ్రామాలతో కలిసి జరగనున్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో ఉన్న 36 వార్డుల సంఖ్య 48కి పెరగనుంది. 2019లో ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు నేతృత్వంలోని పాలకవర్గం కాలం ముగిసింది. 2021లో వైకాపా ప్రభుత్వం పట్టణ విస్తరణకు అసెంబ్లీ ద్వారా యాక్ట్ నంబర్ 5ను తీసుకుని వచ్చింది. దీంతో రాష్ట్రంలోని పలు పురపాలక సంఘాలతో పాటు గుడివాడలో కూడా సమీప గ్రామాల్ని విలీనం చేయడానికి ప్రత్యేక అధికారులు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో వలివర్తిపాడు, మల్లాయపాలెం, బొమ్ములూరు, బిళ్లపాడు, భూషణగూళ్ల, లింగవరం గ్రామాల విలీనానికి కసరత్తు పూర్తి చేసింది. తీరా ఎన్నికలకు రంగం సిద్ధం చేయగా వైకాపా వారికి లాభం చేకూరేలా ప్రభుత్వం అడ్డగోలుగా వార్డుల విభజన చేసిందంటూ నాటి తెదేపా పట్టణ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు కోర్టులో కేసు వేశారు. దీంతో పురపాలక ఎన్నికలు, 6 గ్రామాల ఎన్నికలు నిలిచిపోయాయి. అలాగే, పురపాలక సంఘంలో 6 గ్రామాల విలీనం ఆగిపోయింది.



పురపాలక సంఘ కార్యాలయం

రేపు గుడివాడ ఎన్నికలపై హైకోర్టులో తీర్పు

పురపాలక ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్న నేపథ్యంలో గుడివాడ పురపాలక సంఘంలో ఎన్నికలు ఏడేళ్లుగా నిలిచిపోవడం వల్ల అభివృద్ధి నిధులు ఆగిపోతున్నాయని, పార్టీ అధిష్ఠానం కేసు వెనక్కి తీసుకోవాలని కోరిందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెదేపా పట్టణ మాజీ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు సూచించారు. దీంతో ఆయన తన కేసును వెనక్కి తీసుకుంటూ సంబంధిత పత్రాలను హైకోర్టుకు సమర్పించారు. దీంతో సెప్టెంబరు 1వ తేదీన ఈ కేసుపై తీర్పు వెలువడనుంది.

ఆరు గ్రామాలతో కలిపి ఎన్నికలు

కేసు వెనక్కి తీసుకోవడంతో ఆరు గ్రామాలతో కలిసి పురపాలక ఎన్నికలు జరగనున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన యాక్ట్ నంబర్ 5 ప్రకారం గ్రామాల విలీనం జరగనుంది. 2011లో గుడివాడ పట్టణంలో 1,18,167 మంది, విలీన 6 గ్రామాలతో కలిపి 1,44,845 మంది ఓటర్లు ఉన్నారు. నేడు సర్ లెక్కల ప్రకారం పట్టణంలో 1,04,553 మంది, విలీన గ్రామాలతో కలిసి 1,36,205 మంది ఓటర్లు అవుతారు. లక్ష కన్నా అధికంగా జనాభా ఉంటే పురపాలక సంఘాన్ని తప్పనిసరిగా 48 వార్డులుగా విభజించి ఎన్నికలు జరపాల్సి ఉంది.

సాగునీటి సమస్యను పరిష్కరించాలి

పామర్రు, న్యూస్‌టుడే: పామర్రు నియోజకవర్గంలోని రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యను జలవనరుల శాఖ అధికారుల సమన్వయంతో పని చేయడం ద్వారా పరిష్కరించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మండలంలోని బల్లిపర్రు లాకులను ఆయన ఆదివారం జలవనరులశాఖ అధికారులతో కలిపి పరిశీలించారు. లాకుల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కాలువ చివరి భూములకు సాగునీరు అందేలా జలవనరుల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. నీటి సంఘం అధ్యక్షుడు కొసరాజు వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతం అమృతం లాంటిది: ఆర్డీవో

గుడివాడ(సత్యనారాయణపురం), న్యూస్‌టుడే: సంస్కృత భారతి ఆధ్వర్యంలో పట్టణంలోని సత్యనారాయణపురం ఉపద్రష్ట సత్రంలో జాతీయ సంస్కృత దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గుడివాడ ఆర్డీఓ బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సంస్కృతం అమృతంలాంటి దివ్యమైన భాష అని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. సంస్కృతం నేర్చుకోవడం వల్ల జ్ఞానం పెరుగుతుందని, చిన్న వాక్యంలోనే ఎన్నో అర్థాలను చెప్పే శక్తి ఈ భాషకే ఉందన్నారు. రష్యా వంటి ప్రపంచ దేశాలు సంస్కృతాన్ని ఆదరిస్తున్నాయని, సంస్కృత భారతి కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్ ఎంఆర్.ప్రసాద్, సంస్కృత భారతి అధ్యక్షురాలు కామినేని విజయ, సూర్యకుమారి, రాధారాణి, శివపార్వతి, అర్జున తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం

శ్రీకొండలమ్మకు మంత్రి, ఎమ్మెల్యే పూజలు

వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని ప్రసిద్ధ వేమవరం శ్రీకొండలమ్మ తల్లి దేవస్థానాన్ని ఆదివారం మంత్రి కొల్లు రవీంద్ర, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌లు సందర్శించి పూజలు నిర్వహించారు. వారికి ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికి శేషవస్త్రాలను అందజేశారు. ఆదివారం కావడంతో జిల్లా నలుమూలల నుంచి దాదాపు 15 వేల మంది భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. మహిళలు సామూహిక పాలపొంగళ్లు నైవేద్యంగా వండి సమర్పించారు. మొక్కుబడులు తీర్చుకుని బంధుమిత్రులకు అన్నసమారాధన చేశారు.



ఆలయంలో మంత్రి కొల్లు, ఎమ్మెల్యే కాగిత

సభ్యత్వం పెంపునకు సభ్యులు కృషి చేయాలి

పామర్రు, న్యూస్‌టుడే: మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యత్వ నమోదు పెంపునకు ప్రతి సభ్యుడు కృషి చేయాలని సంఘం అధ్యక్షుడు సుధాకర్ చెప్పారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబరులో ఉపాధ్యాయ దినోత్సవ నిర్వహణకు మొక్కలు నాటడంపై ప్రణాళికలను తయారు చేసి అమలుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సంఘం సభ్యులు ప్రసాద్, పి.ప్రసాద్, నారాయణ, ప్రభాకరరావు, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధాకర్

మెహెర్‌బాబా బోధనలు అనుసరణీయం

చల్లపల్లి, న్యూస్‌టుడే: మనిషి అహంకారాన్ని వీడి మానవత్వంతో మెలగాలని మెహెర్‌బాబా బోధించారని, వారి బోధనలు అనుసరణీయమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం చల్లపల్లిలో మెహెర్‌బాబా 61వ వార్షికోత్సవ సహవాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మెహెర్ నృత్యనికేతన్ విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. తొలుత ఆధ్యాత్మిక ర్యాలీ నిర్వహించారు. ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చింతల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తదితరులు

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

కోడూరు: అవనిగడ్డ - కోడూరు లైన్లో స్తంభాల నూతనీకరణ పనిలో భాగంగా కోడూరు, రామకృష్ణాపురం విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఉయ్యూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీ.సుధాకర్ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోడూరు ఏఈ కె.గోపీచంద్ కోరారు.

అగ్నిప్రమాద బాధితురాలికి చేయూత



సాయం అందిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

కోడూరు, న్యూస్‌టుడే: విశ్వనాథపల్లి గ్రామంలో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బత్తుల కోటమ్మకు రెడ్‌క్రాస్, కోడూరు శాఖ వారు ఆదివారం చేయూతనందించారు. వంట సామగ్రి, టార్పాలిన్ పట్టా, శ్రీకనకదుర్గ రైస్‌మిల్ యజమాని తోట శేషగిరిరావు అందించిన బియ్యం, నిత్యావసర సరకులు అందించారు. తోట రాంబాబు ఆర్థిక సహకారం అందించారు. జరుగు పోతురాజు, తోట శ్రీనివాసరావు, కొండవీటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హంసలదీవి బీచ్ వద్ద పర్యాటకుల సందడి

కోడూరు, న్యూస్‌టుడే: ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులతో హంసలదీవి శివారు పాలకాయతిప్ప సముద్రతీరంలో సందడి నెలకొంది. మెరైన్ పోలీసు సిబ్బంది భద్రతా చర్యలు తీసుకున్నారు. తిరుగు పయనంలో హంసలదీవిలోని శ్రీవేణుగోపాల స్వామిని భక్తులు దర్శించుకున్నారు.

శ్రీకనకదుర్గమ్మ శ్రావణ సంబరం

కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని కౌతవరం 1వ వార్డులో శ్రావణమాసం సందర్భంగా నెయ్యత సంఘీయుల ఆధ్వర్యంలో శ్రీకనకదుర్గమ్మ తల్లి 51 వార్షిక సంబరాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రతి ఏటా శ్రావణమాసంలో ఒక ఆదివారం ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. అమ్మవారి భారీ ప్రభను అలంకరించిన వాహనంపై నృత్యాలు, బాణసంచా కాల్పులతో కౌతవరం, కూరాడ, గుడ్లవల్లేరులలో ఊరేగించారు. ఇంటింటా అమ్మవారికి పసుపు నీరు వారపోసి పూజాదికాలు చేశారు.



అమ్మవారి ప్రభ ఊరేగింపు

సందడిగా ఘటాల సమర్పణ

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక గ్రామ దేవత లంకమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం ఘటం బిందెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వివాహాల సీజన్ మొదలు కావడంతో అమ్మవారికి ఘటం బిందె సమర్పించి పెళ్లి పనులు ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది.

వైభవంగా మాస కల్యాణోత్సవం

డోకిపర్రు (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని డోకిపర్రు శ్రీభూసమేత వేంకటేశ్వరాలయంలో ఆదివారం స్వామివారి మాస కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు కె.బాపిరెడ్డి దంపతుల పర్యవేక్షణలో పెద్దసంఖ్యలో దంపతులు పాల్గొని పూజలు చేశారు.



కల్యాణోత్సవంలో దంపతులు

ఘనంగా రేణుక అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : మండలంలోని చాగంటిపాడు శివారు పిల్లివానిలంకలో రేణుక అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, తెదేపా మండల అధ్యక్షుడు వీరపనేని శివరామప్రసాద్ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



శాశ్వత నిత్యాన్నదాన పథకానికి వితరణ

మోపిదేవి, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ వాస్తవ్యులు జానకిరామ వెంకట్ విఠల్ సాయితేజ రాజు, అనంత ఇషాన్‌లు మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం నిత్యాన్నదాన పథకానికి చెరొక రూ. లక్ష చొప్పున ఆదివారం అందించారు. ఈవో దాసరి శ్రీరామవరప్రసాద్ వారిని శేషవస్త్రాలతో సత్కరించారు. దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



వితరణ అందిస్తున్న భక్తులు

స్వామి ఆదాయం రూ.7.25 లక్షలు

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆర్జిత పూజలైన మహన్యాస రుద్రాభిషేకాలు, రాహు, కేతు, సర్పదోష పూజలు, నిత్యశాంతి కల్యాణం తదితర పూజలలో పాల్గొన్నారు. ఆదాయం రూ.7.25 లక్షలు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆర్జిత సేవలకు అత్యధికంగా రూ.5.26 లక్షల ఆదాయం వచ్చింది.

ఘనంగా బీరయ్యస్వామి, గంగానమ్మతల్లి సంబరం

పెదపారుపూడి, న్యూస్‌టుడే: మండలంలోని వెంట్రప్రగడలో శ్రీబీరయ్యస్వామి వార్షిక సంబరాన్ని కురమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. భక్తులు, గ్రామస్థులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఊరేగింపు తర్వాత దోసపాడు ఛానల్‌లో పుణ్య స్నానం చేయించారు. సాయంత్రం గంగానమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు.



పురవీధుల్లో స్వామి ఊరేగింపు

ఇంజినీరింగ్ విద్యార్థికి ఆర్థిక సాయం

చల్లపల్లి, న్యూస్‌టుడే: నిరుపేద ప్రతిభావంతులైన విద్యార్థుల భవిష్యత్‌కు భరోసాగా చల్లపల్లి పీపుల్ పేజ్ సేవా సంస్థ నిలుస్తుందని ప్రతినిధి ముమ్మనేని సన్నీ అన్నారు. చల్లపల్లికి చెందిన కొడాలి చరణ్‌తేజ్ ఇంజినీరింగ్ విద్యకు రూ.55 వేలను అందజేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో సంస్థ ద్వారా మరింత మందికి సాయం అందిస్తామని తెలిపారు.



చరణ్‌తేజ్‌కు సాయాన్ని అందజేస్తున్న ప్రతినిధులు

ప్రత్యేక డ్రైవ్‌లు సత్వరం ఆన్‌లైన్ చేయాలి

కూచిపూడి, న్యూస్‌టుడే: ఇటీవల నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల శిబిరాల్లో వచ్చిన దరఖాస్తులను సత్వరమే ఆన్‌లైన్ చేయాలని పామర్రు నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎం.నీలకంఠేశ్వరరెడ్డి సూచించారు. ఆదివారం నిడుమోలులోని 203, 204, 205 పోలింగ్ కేంద్రాల్లో నమోదైన వాటిని పరిశీలించారు. ఈనెల 22, 23 తేదీలల్లో నిర్వహించిన ప్రత్యేక నమోదు ప్రక్రియలో వచ్చిన దరఖాస్తులు పలు చోట్ల ఇప్పటికి ఆన్‌లైన్ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హత ఉన్న యువత నుంచి దరఖాస్తులు వచ్చేలా కృషి చేయాలని చెప్పారు. ఆర్ఐ విజయదుర్గ, డి.టి.రఘురామ్ పాల్గొన్నారు.



సిబ్బందితో చర్చిస్తున్న నీలకంఠేశ్వరరెడ్డి

పెదపారుపూడి మండలంలో..

పెదపారుపూడి, న్యూస్‌టుడే: మండలంలోని 30 పోలింగ్ కేంద్రాల్లో 30 మంది బీఎల్వోలు ఓటర్ల నుంచి అభ్యంతరాలు, సవరణలకు సంబంధించిన ఫారం-6, 7, 8లను ఆదివారం స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు ఏసుపాదం, సర్వే డి.టి. సుందరరావు, ఆర్.ఐ.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ మేఘన, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.